# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జనం రిపోర్టర్ జనశ్రేయస్సే మా బాధ్యత



విలేకరులు కావలెను

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను. అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948



సంపుటి : 02 సంచిక : 04, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ శనివారం -03 - మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## నాకూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయి: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు బెదిరింపు కాల్స్

స్పీకర్‌కు వచ్చిన కాల్స్ గురించి అడగ్గా వెల్లడించిన సీఎం

బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశం

మంగళూరు బజరంగ్ దళ్ కార్యకర్త హత్య నిందితులను పట్టుకోవాలని ఆదేశాలు

## పహల్గామ్ దాడి.. ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని పీవోకేలో ప్రజలకు అలర్ట్



న్యూఢిల్లీ : పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో, ముఖ్యంగా వాస్తవాధీన రేఖ (ఎల్వోసీ) వెంబడి నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆహార నిల్వలను సిద్ధం చేసుకోవాలని స్థానిక యంత్రాంగం సూచించింది. భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఇటీవల పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. మిగతా.. 2లో

## హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఎప్పుడంటే..?




హైదరాబాద్ :: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చి హైడ్రా .. హైదరాబాద్ నగరంలో సంచలనం గా మారడంతో పాటు.. ఇతర జిల్లాల్లో కూడా ఏర్పాటు చేయాలనే భారీ డిమాండ్ ఏర్పడింది. అక్రమ కట్టడాలను నేల కూల్చడమే లక్ష్యంగా, చెరువులు, పార్క్‌లో, ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా మిగతా.. 2లో

# మా రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునేలా చేస్తాం






## అమరావతి పునర్ నిర్మాణానికి బటన్ నొక్కిన ప్రధాని మోదీ

ఐదు కోట్ల మంది ఆంధ్రుల రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ పునఃప్రారంభోత్సవం చేశారు. ఇవాళ అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ సభలో, లక్షలాది మంది ప్రజల సమక్షంలో, సభా వేదిక పైనుంచే రాజధాని పునర్ నిర్మాణ పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. బటన్ నొక్కి రాజధాని పనులు సహా మొత్తం రూ.58 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అందులో రాజధాని పనుల విలువ రూ.49,040 కోట్లు. రూ.8 కోట్ల విలువైన వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు కూడా ప్రధాని మోదీ నేడు శంకుస్థాపన చేశారు. ఇవాళ్టి కార్యక్రమంలో మొత్తంగా 18 ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం చుట్టారు.

- మూడేళ్ల తర్వాత అమరావతి సిటీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ మళ్లీ రావాలి: చంద్రబాబు
- అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ
- చంద్రబాబు ప్రసంగం
- మోదీ సహకారంతో అమరావతిని ప్రపంచం
- గర్వించేలా నిర్మిస్తామని ధీమా
- ఇది మా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా తీర్చిదిద్దుతామని వెల్లడి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో అమరావతిని



గర్వించేలా నిర్మిస్తామని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రాత్మక విజయం సాధించిందని చంద్రబాబు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉందని, ప్రధాని మోదీ అండతో దానిని తిరిగి గాడిలో పెడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి స్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తీసుకొస్తున్నామని అన్నారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల సెంటిమెంట్ అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణం కోసం నాడు 29 వేల మంది రైతులు తమ భవిష్యత్తును త్యాగం చేసి 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారని గుర్తుచేశారు. చారిత్రకంగా అమరలింగేశ్వర స్వామి, కృష్ణానది, బౌద్ధారామాలకు నిలయమైన అమరావతి అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చెప్పలేని కష్టనష్టాలు అనుభవించారని, వారి పోరాటం, త్యాగం మరువలేనిదని అన్నారు. అమరావతి ఉద్యమం లాంటి దాన్ని మిగతా.. 2లో

## ఇటీవల కలిసినప్పుడు మోదీ చాలా సీరియస్ గా కనిపించారు: చంద్రబాబు

- నేటి రోజు ఏపీ చరిత్రలో శాశ్వతంగా నిలుస్తుందన్న సీఎం చంద్రబాబు.
- గతంలో అమరావతి పనులకు మోదీనే శంకుస్థాపన చేశారని వెల్లడి
- మళ్లీ ఆయన చేతుల మీదుగానే పునఃప్రారంభం అవుతున్నాయని వివరణ
- మోదీ కులగణన నిర్ణయం భేష్ అంటూ ప్రశంసలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఈ రోజు శాశ్వతంగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవ సభలో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. గతం లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పను లకు శంకుస్థాపన మిగతా.. 2లో






## అమరావతిలో క్వాంటం వ్యాలీ... టెక్ దిగ్గజాలతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

- అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ఒప్పందం
- ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ%టీతో ఏపీ ప్రభుత్వ ఎంవోయూ
- భారత్ లోనే తొలి, శక్తివంతమైన ఐబీఎం 'క్వాంటం సిస్టం 2' ఏర్పాటు
- 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ తో కంప్యూటర్
- 2026 జనవరి 1న కార్యకలాపాల ప్రారంభ లక్ష్యం

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటం కంప్యూటింగ్ రంగంలో దేశానికే మార్గదర్శిగా నిలపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. అమరావతిలో అత్యాధునిక క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ ఏర్పాటు కోసం మిగతా.. 2లో

## రాజధాని కోసం అమరావతి రైతులు చేసిన పోరాటానికి శిరస్సు వంచి నమస్కారం

- అమరావతి రైతుల పోరాటానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్న పవన్
- గత ప్రభుత్వం దివిసీమ ఉప్పెనలా అమరావతిని తుడిచి వేసిందని మండిపాటు
- మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ దూసుకుపోతుందని ధీమా



అమరావతి : ఏపీ రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ రాజధాని రైతులపై ప్రశంసలు కురిపించారు. ఒక్క పిలుపుతో రాజధాని కోసం వేలాది ఎకరాల భూమిని ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని కోసం అమరావతి రైతులు చేసిన పోరాటానికి శిరస్సు వంచి నమ స్కారం చేస్తున్నానని చెప్పారు. అమరావతి రైతులు కేవలం భూములు మాత్రమే ఇవ్వలేదని... రాష్ట్రానికి భవిష్య త్తును ఇచ్చారని అన్నారు.

## మోదీ శంకుస్థాపన చేసిన అమరావతిని ఆపే దమ్ము ఎవరికీ లేదు: మంత్రి నారా లోకేశ్

- అమరావతి పనుల పునఃప్రారంభ సభలో మంత్రి నారా లోకేష్ ప్రసంగం
- గత ప్రభుత్వ వైఖరిపై విమర్శలు,
- అమరావతి రైతుల త్యాగాలకు వందనం
- ప్రధాని మోదీ సహకారంతో అమరావతి అభివృద్ధి ఆగదని ధీమా
- పాక్ ఉగ్రదాడిపై తీవ్ర వ్యాఖ్యలు, కేంద్ర కులగణన నిర్ణయంపై హర్షం
- రాష్ట్రంలో భారీ పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయమని వెల్లడి




అమరావతి : ఏపీ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేశారు. ఈ సందర్భంగా

వెలగపూడిలో ఏర్పాటు చేసిన సభలో ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రసంగించారు.

చంద్రబాబుపై కక్షతో...!

గత ప్రభుత్వం చంద్రబాబుపై వ్యక్తిగత కక్షతోనే అమరావతిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసిందని మంత్రి లోకేశ్ విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో ఐదేళ్లు కాలయాపన చేశారే తప్ప, రాజధానిలో ఒక్క ఇటుక కూడా వేయలేదని ఆరోపించారు. అమరావతి కోసం 1,631 రోజుల పాటు అలుపెరగని పోరాటం చేసిన రైతుల త్యాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు.

## ప్రధానమంత్రి పక్కన శశిథరూర్.. నరేంద్రమోదీ ఆసక్తికర వ్యాఖ్యలు



- కేరళలో రూ.8,900 కోట్ల విఝింజం పోర్ట్ ప్రారంభించిన ప్రధాని మోదీ
- కార్యక్రమానికి హాజరైన స్థానిక కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్
- కాంగ్రెస్ పార్టీని ఉద్దేశిస్తూ మోదీ వ్యంగ్య వ్యాఖ్యలు
- ఈ కార్యక్రమం చూసి కొంతమందికి నిద్రపట్టదని వ్యాఖ్య

ఢిల్లీ : "ఈరోజు శశిథరూర్ ఇక్కడే నా పక్కన ఉన్నారు. ఈ కార్యక్రమం కొంతమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడకు వెళ్లాలో అక్కడకు వెళ్లిపోయింది" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు.

# 'అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి'.. ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

### జూన్ 21న మళ్లీ వస్తా.. దేశమంతా ఏపీ గురించి మాట్లాడుకునేలా చేద్దాం : ప్రధాని మోదీ

అమరావతి నిర్మాణం స్వర్ణాంధ్ర నిర్మాణానికి బీజం వేస్తుంది

హరిత శక్తి స్వచ్ఛ పరిశ్రమలు, విద్యా వైద్య కేంద్రాలుగా అమరావతి మారుతుంది

తాను ఇప్పుడు అమరావతి పుణ్యభూమిపై నిలబడి ఉన్నాను

ఏపీలోని ప్రతి ఊరు, గ్రామం, వీధి, ఇంటిలో యోగాని ప్రచారం చేయాలని పిలుపు




అమరావతి :అమరావతి అంటే కేవలం ఒక నగరం కాదు.. అమరావతి అంటే ఒక శక్తి.. ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన ఆంధ్రప్రదేశ్‌గా ఇది మారుస్తుంది అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ఇంద్రుడి రాజధాని అమరావతి అని మనకు తెలుసు.. ఇప్పుడు అమరావతి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా నిలిచింది. ఇది యాదృచ్ఛికం కాదు. ఇది స్వర్ణ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి శుభసూచకం.. అమరావతి స్వర్ణాంధ్ర విజన్ కు శక్తిని ఇస్తుందన్నారు.

## తెలంగాణలోని మదర్సాలపై రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు



- తెలంగాణలో అనుమతిలేని మదర్సాలు పెరుగుతున్నాయని ఎంపీ రఘునందన్ ఆరోపణ
- జిన్నారం మదర్సాలో బీహార్ విద్యార్థులు, బంగ్లాదేశీయుల ప్రమేయంపై అనుమానం వ్యక్తం
- మదర్సాల వివరాలు, నియంత్రణపై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడి
- విషయాన్ని గవర్నర్, కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళతానని ప్రకటన

తెలంగాణ రాష్ట్రంలో అనుమతులు లేకుండా అనేక మదర్సాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని, వాటిపై ప్రభుత్వ నియంత్రణ మిగతా.. 2లో

## కేసీఆర్ చేసిన పెద్ద మిస్టేక్ అదే.. మంత్రి పొంగులేటి



హైదరాబాద్ : : పదేళ్ల బీఆర్ఎస్ పాలన, మాజీ సీఎం కేసీఆర్ పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో పొంగులేటి చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థ ను తన దగ్గర పెట్టుకొని కేసీఆర్ సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో మంత్రులకు పవర్ లేదు.. స్వేచ్ఛగా రివ్యూ చేసుకునే పరిస్థితి ఉండేది కాదని గుర్తుచేశారు. పదేళ్ల పాటు ఒక్క మంత్రిని కూడా మిగతా.. 2లో

## నాకూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయి: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

న్యూఢిల్లీ : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ యూటీ ఖాదర్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చిన విషయంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. "అవును.. నాకు కూడా బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చాం. బెదిరింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం" అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. తనకు వస్తున్న బెదిరింపులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల మంగళూరులో జరిగిన బజరంగ్ దళ్ కార్యకర్త సుహాస్ శెట్టి హత్య ఘటనపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. ఈ హత్య కేసులో ప్రమేయమున్న నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి, అరెస్టు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మంగళూరులో సుహాస్ శెట్టిని నడిరోడ్డుపై కొందరు దుండగులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన నేపథ్యంలో మంగళూరులో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. నగర పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధాజ్ఞలు విధించి, ప్రజలు గుంపులుగా గుమిగూడటాన్ని, ఊరేగింపులు, నినాదాలు చేయడాన్ని నిషేధించారు. సుహాస్‌ను పథకం ప్రకారమే హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినప్పటికీ, హత్యకు గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## పహల్గామ్ దాడి.. ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని పీవోకేలో ప్రజలకు అలర్ట్

మొదటి పేజి తరువాయి

శుక్రవారం స్థానిక అసెంబ్లీలో చౌధ్రీ అన్వర్ ఉల్ హక్ మాట్లాడుతూ, నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. "రాబోయే రెండు నెలలకు సరిపడా ఆహార ధాన్యాలు, నిత్యావసరాలను నిల్వ చేసుకోవాలని ప్రజలకు సూచించాం" అని వెల్లడించారు. అంతేకాకుండా, ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు స్థానిక ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకోసం రూ. 100 కోట్లతో ఒక అత్యవసర నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆహారం, ఔషధాలు, ఇతర కనీస అవసరాల సరఫరాలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా చూడటమే ఈ నిధి యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన వివరించారు.

## హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఎప్పుడంటే..?

మొదటి పేజి తరువాయి

పని చేస్తున్న హైడ్రాకు ప్రభుత్వం మరిన్ని అధికారాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హైడ్రా పోలీస్ స్టేషన్ల ను ఏర్పాటు చేయనున్నట్లు గతంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. కాగా ఈ నెల 8న హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఇకపై హైడ్రా పోలీస్ స్టేషన్లలో స్థానికులు, అధికారుల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేయనున్నారు. ప్రస్తుతం సాధారణ పోలీస్ స్టేషన్ లలో నమోదు అయిన భూకబ్జా కేసులపై హైడ్రా చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే సాధారణ పోలీస్ స్టేషన్‌ల నుంచి హైడ్రా PSకు కేసులు బదిలీ అయ్యే ఛాన్స్ ఉంది.

## రాజధాని కోసం అమరావతి రైతులు చేసిన పోరాటానికి శిరస్సు వంచి నమస్కారం

మొదటి పేజి తరువాయి

ధర్మ యుద్ధంలో అమరావతి రైతులు గెలుపొందారని చెప్పారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు తాము బాధ్యులుగా ఉంటామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. రాజధానిని అద్భుతంగా నిర్మించి అమరావతి రైతుల రుణం తీర్చుకుంటామని చెప్పారు. ఎన్డీయే కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో ఏపీ అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దివిసీమ తుపానులా అమరావతిని గత ప్రభుత్వం తుడిచిపెట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు నలిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రైతుల త్యాగాలను మర్చిపోలేమని చెప్పారు. పహల్గామ్ దుర్ఘటనలో 27 మంది మరణించారని... ఈ సమయంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ప్రధాని మోదీ అమరావతి కోసం ఇక్కడకు రావడం... అమరావతిపై ఆయనకున్న ఇష్టానికి నిదర్శనమని పవన్ అన్నారు. ఎంతో విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని కితాబిచ్చారు. ఎంతో దూరదృష్టితో హైదరాబాద్ లో హైటెక్ సిటీని నిర్మించిన చంద్రబాబు... ఇప్పుడు అమరావతికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ దూసుకుపోతుందని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలోని మదర్సాలపై రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

కొరవడిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో కొత్తగా వెలుస్తున్న మదర్సాలలో ఎన్నింటికి అధికారిక అనుమతులు ఉన్నాయో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

జిన్నారం మదర్సాపై తీవ్ర అనుమానాలు

ముఖ్యంగా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సంగారెడ్డి జిల్లా జిన్నారం మదర్సా కార్యకలాపాలపై తమకు అనుమానాలు ఉన్నాయని రఘునందన్ రావు అన్నారు. జిన్నారం మదర్సాలో మొత్తం 70 మంది విద్యార్థులు ఉండగా, వారిలో 65 మంది బీహార్‌లోని కిషన్ గంజ్ జిల్లాకు చెందిన వారని, వారికి బోధించే ఉపాధ్యాయులు కూడా అదే ప్రాంతం వారని ఆయన పేర్కొన్నారు. కిషన్ గంజ్ బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉందని, అక్కడి నుంచి బంగ్లాదేశీయులు వలస వచ్చి జిన్నారంలో శిక్షణ పొందుతున్నారేమోనన్న అనుమానం కలుగుతోందని అన్నారు. కిషన్ గంజ్‌లో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వారు స్థానిక హిందువుల భూములను బలవంతంగా లాక్కుంటూ 'ల్యాండ్ జిహాద్'కు పాల్పడుతున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. జిన్నారంలో కోదండరామస్వామి ఆలయ భూముల్లో మదర్సా ఎలా ఏర్పాటైందో అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై తాను సాధారణ పౌరుడిగా చేసిన ప్రాథమిక విచారణలోనే అనేక ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయని, పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు.

విదేశీయుల గుర్తింపు, ప్రభుత్వ జోక్యం అవసరం

మదర్సాల విషయంలో అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం లభించడం లేదని, అందుకే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి, ఆ తర్వాత గవర్నర్, కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళతామని రఘునందన్ రావు స్పష్టం చేశారు. తన నియోజకవర్గంలోని ఇస్నాపూర్‌లోనే 247 మంది నేపాలీలకు ఆధార్ కార్డులు జారీ చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను గుర్తించి వారిని వెనక్కి పంపే చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు కూడా తమ పరిసరాల్లోని మదర్సాల కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యక్రమాలపై నియంత్రణ ఎవరి చేతుల్లో ఉందో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రధానమంత్రి పక్కన శశిథరూర్.. నరేంద్రమోదీ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

కేరళ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ సీనియర్ నేత, స్థానిక ఎంపీ శశిథరూర్‌తో ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరువనంతపురం సమీపంలోని విఝింజమ్ అంతర్జాతీయ ఓడరేవు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ, అదే వేదికపై ఉన్న తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌ను ప్రస్తావిస్తూ పరోక్షంగా కాంగ్రెస్ పార్టీకి చురకలు అంటించారు. కాగా, గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధాని మోదీకి శశిథరూర్ వ్యక్తిగతంగా స్వాగతం పలికారు. విమానాల ఆలస్యం కారణంగా చివరి నిమిషంలో తిరువనంతపురం చేరుకున్నప్పటికీ, తన నియోజకవర్గానికి వచ్చిన ప్రధానికి స్వాగతం పలికానని శశిథరూర్ స్వయంగా సోషల్ మీడియాలో వెల్లడించారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీతో, ముఖ్యంగా అధినాయకత్వంతో శశిథరూర్‌కు సత్సంబంధాలు లేవనే ప్రచారం జరుగుతోంది. పలు సందర్భాల్లో ఆయన పార్టీ విధానాలకు భిన్నంగా, అలాగే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తూ మాట్లాడటం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. ఈ క్రమంలో ప్రధాని పాల్గొన్న అధికారిక కార్యక్రమంలో థరూర్ పాలుపంచుకోవడం, దీనిపై మోదీ ప్రత్యేకంగా వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కేసీఆర్ చేసిన పెద్ద మిస్టేక్ అదే.. మంత్రి పొంగులేటి

మొదటి పేజి తరువాయి

సరిగా పనిచేయనీయలేదని అన్నారు. భూభారతి వల్ల 70 శాతం ప్రజలకు ఉపయోగం జరిగినా తాము సక్సెస్ అయినట్లే అని చెప్పారు. భూభారతి లో కొత్త సాఫ్ట్వేర్ రాబోతోందని కీలక ప్రకటన చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో అవినీతి జరగదు.. జరగనివ్వను అని హామీ ఇచ్చారు. త్వరలోనే రాష్ట్రంలో సర్వేయర్ల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. జూన్‌లో సర్వే మ్యాప్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా రిజిస్ట్రేషన్‌లు చేస్తామని వెల్లడించారు. 6 వేలు దరఖాస్తులు సర్వేకు వచ్చాయి.. భర్తీ చేయబోతున్నామని అన్నారు. ప్రైవేట్ సర్వేయర్లతో భూముల సర్వే జరుగుతుంది ప్రభుత్వ పర్యవేక్షణ సైతం ఉంటుందని చెప్పారు.

# మా రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునేలా చేస్తాం

మొదటి పేజి తరువాయి



తన జీవితంలో చూడలేదని కొనియాడారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో అమరావతికి మళ్లీ ప్రాణం పోశారని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పునర్ నిర్మాణ పనులను ప్రారంభించుకోవడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజని చంద్రబాబు అభివర్ణించారు. ఐదు కోట్ల మంది ప్రజలు గర్వంగా 'ఇది మా రాజధాని' అని చెప్పుకునేలా అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు కేంద్రంగా, ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలతో అనుసంధానమై ఉండేలా, గ్రీన్ ఎనర్జీతో కాలుష్య రహిత నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తామని వివరించారు. అమరావతిలో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు చదువుకునేలా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని స్థాపించి ఐటీ విప్లవానికి నాంది పలికామని, దానిని నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఏఐ (కృత్రిమ మేధ) రంగంలోనూ ఏపీ దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడేళ్ల తర్వాత అమరావతి నగరం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకున్నాక, మళ్లీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. అమరావతి అభివృద్ధికి మోదీ అందిస్తున్న సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశీస్సులు తమకు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కేవలం అమరావతే కాకుండా, రాష్ట్రంలోని అన్ని 26 జిల్లాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. ఇవాళ అమరావతికి వర్ష సూచన ఉందన్నారని, కానీ వర్షం రాకుండా దేవతలు మొత్తం ఆశీర్వదించారని చంద్రబాబు సంతోషంగా చెప్పారు. ప్రధాని మోదీ కూడా ఒక మాట అన్నారని, తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ సభ కూడా ప్రతికూల వాతావరణం కారణంగా రద్దవలేదని, ఇవాళ అమరావతి సభ కూడా సక్సెస్ అయి తీరుతుందని చెప్పారని చంద్రబాబు వివరించారు.

## 'అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి'.. ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి



తల్లి దుర్గ భవాని.. కొలువైన పుణ్యభూమిలో మీ అందరినీ కలవటం నాకు ఆనందంగా ఉందని.. మోడీ తెలుగులో తన ప్రసంగాన్ని మొదలుపెట్టారు. తాను ఇప్పుడు అమరావతి పుణ్యభూమిపై నిలబడి ఉన్నానని అన్నారు. ఒక స్వప్నం సాకారం కాబోతుందని నరేంద్ర మోడీ తెలిపారు. ఇక్కడ తనకు కనపడుతుంది ఒక నగరమే కాదు.. ఒక కల సాకారం అవుతుందన్న భావన కలుగుతుందన్నారు. అమరావతి అంటే సంప్రదాయం , పురోగతి అని అన్నారు. ఇవి కాంక్రీట్ నిర్మాణాలు కాదని వికాసిత్ భారతకు పునాది వేస్తుందన్నారు. అమరావతి ఇంద్రలో ఒక రాజధాని పేరు అని అన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణానికి ఇది శుభసంకేతం అని పీఎం మోడీ తెలిపారు. అమరావతి నిర్మాణం స్వర్ణాంధ్ర నిర్మాణానికి బీజం వేస్తుంది పేర్కొన్నారు. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్న, త్వరగా పూర్తి చేయాలన్న చంద్రబాబుకే సాధ్యం అన్నారు. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు ఉంటుందన్నారు. ఐటీ, ఎఇ సహా అన్ని రంగాలకు అమరావతి గమ్యస్థానాంలో మారుతుంది అన్నారు. హరిత శక్తి స్వచ్ఛ పరిశ్రమలు, విద్యా వైద్య కేంద్రాలుగా అమరావతి మారుతుందన్నారు. అమరావతిలో మౌలిక పనుల కల్పనకు కేంద్రం సహకారం ఉంటుందన్నారు. తాను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాదులో ఐటి ఎలా అభివృద్ధి చేశారు తెలిపారు. అధికారులను పంపించి హైదరాబాద్ ఐటీ అభివృద్ధి పై అధ్యయనం చేశామన్నారు. జూన్ 21న మళ్లీ ఏపీకి వస్తానన్న ఆయన.. ఆ రోజున యావత్ ప్రపంచం మనవైపు చూసి మాట్లాడుకునేలా చేయాలన్నారు. జూన్ 21న జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఇంకా 50 రోజులు ఉందని, ఈ 50 రోజుల్లో ఏపీలోని ప్రతి ఊరు, గ్రామం, వీధి, ఇంటిలో యోగాని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అది సాధ్యమవుతుందని తాను నమ్ముతున్నానని, ఈ ఘనతను సాధిస్తామని తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించే యోగా దినోత్సవానికి తాను కచ్చితంగా వస్తానని మరోసారి నొక్కి చెప్పారు. ఏపీలో కలలు కనేవారు తక్కువకాదు, వాటిని నిజం చేసేవారి సంఖ్య కూడా తక్కువ కాదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి వేగాన్ని ఇలాగే కొనసాగించాలని, మూడు సంవత్సరాల్లో అమరావతి నిర్మాణం పూర్తయ్యాక ఏపీ జీడీపీ ఏ స్థాయికి వెళ్తుందో తాను ఊహించగలనని తెలిపారు. టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీకి అమరావతి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో మీ భుజంతో పాటు నా భుజం కూడా కలిపి పనిచేస్తానని ప్రధాని మోడీ చెప్పారు. "మీ అందరి ఆశీర్వాదంతో ఈ కూటమి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నది" అని చివరిగా తెలుగులో ప్రసంగించి.. తన స్పీచ్‌ను వందేమాతరం అంటూ ముగించారు.

## అమరావతిలో క్వాంటం వ్యాలీ... టెక్ దిగ్గజాలతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

మొదటి పేజి తరువాయి




ఐబీఎం , టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , లార్సన్ అండ్ టూబ్రో వంటి దిగ్గజ సంస్థలతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, టెక్నాలజీ దిగ్గజం ఐబీఎం.. భారతదేశంలోనే మొట్టమొదటి, అత్యంత శక్తివంతమైన 'క్వాంటం సిస్టం 2'ను అమరావతిలో నెలకొల్పనుంది. ఇది 156 క్యూబిట్ సామర్థ్యం కలిగిన అత్యాధునిక హెరాన్ ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. ఈ ప్రతిష్ఠాత్మక క్వాంటం వ్యాలీ కార్యకలాపాలను 2026 జనవరి 1 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, గతంలో ఐటీ విప్లవానికి ఏపీ ఊతమిచ్చినట్లే, ఇప్పుడు క్వాంటం విప్లవానికి కూడా నాయకత్వం వహిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "ఇది ఏపీకే కాదు, దేశానికే చారిత్రక దినం" అని ఆయన అన్నారు. భవిష్యత్ పాలనకు, ఆవిష్కరణలకు క్వాంటం కంప్యూటింగ్ పునాది అవుతుందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ అవ కాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిది ద్దాలన్నారు. హైటెక్ సిటీని 15 నెలల్లో నిర్మించిన అనుభవంతో, దీన్ని కూడా వేగంగా పూర్తి చేస్తామని, ఎల్%డ%టీకి ఇప్పటికే స్థలం కేటాయించామని తెలిపారు. పనుల పర్యవేక్షణకు రెండు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. భారత్‌లో ఐబీఎం క్వాంటం సిస్టం 2ను స్థాపించడం దేశ క్వాంటం ప్రయాణంలో కీలక మలుపు అని ఐబీఎం క్వాంటం వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా అన్నారు. ఈ భాగస్వామ్యం క్వాంటం అల్గారిథమ్‌ల అభివృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. క్వాంటం, క్లాసికల్ వ్యవస్థల అనుసంధానంతో జీవశాస్త్రం, మెటీరియల్ సైన్స్ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని టీసీఎస్ సీటీవో డాక్టర్ హారిక్ విన్ తెలిపారు. ఈ ప్రాజెక్టుతో పరిశోధన, అభివృద్ధికి ఊతం లభిస్తుందని టీసీఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఇటీవల కలిసినప్పుడు మోదీ చాలా సీరియస్ గా కనిపించారు: చంద్రబాబు

మొదటి పేజి తరువాయి



జరి గిందని, దురదృష్టవశాత్తు గత ఐదేళ్లుగా ఈ పనులు నిలిచిపోయాయని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ ప్రధాని మోదీ చేతుల మీదుగానే (పరోక్షంగా ఆయన ప్రభుత్వ హయాంలో) పనులు పునఃప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో తాను ప్రధాని మోదీని కలిసినప్పుడు ఆయన ఎంతో ఆహ్లాదంగా ఉండేవారని, కానీ ఇటీవల కలిసినప్పుడు మాత్రం చాలా గంభీరంగా కనిపించారని ముఖ్యమంత్రి తెలిపారు. పహల్గామ్‌లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్న బాధ ఆయనలో స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు తమ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. "మోదీ జీ, మేమంతా మీ వెంటే ఉన్నాం. వందేమాతరం, భారత్ మాతాకీ జై" అంటూ తాము ప్రధాని వెంటే నిలుస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నట్లు ప్రకటించారు. సరైన సమయంలో సరైన నేత దేశాన్ని పాలిస్తున్నారని చంద్రబాబు ప్రధాని మోదీని ఉద్దేశించి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మోదీ నాయకత్వాన్ని ఆమోదిస్తున్నారని కొనియాడారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యేనాటికి భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో పదో స్థానంలో ఉందని, ఇప్పుడు ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని గుర్తుచేశారు. త్వరలోనే భారత ఆర్థిక వ్యవస్థ మూడో స్థానానికి చేరుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు పేదరిక నిర్మూలనకు ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. దేశాభివృద్ధే లక్ష్యంగా ఆయన శ్రమిస్తున్నారని అన్నారు. ఇటీవల కులగణన చేయాలని మోదీ నిర్ణయం తీసుకున్నారని, ఇది కేంద్రం తీసుకున్న గొప్ప నిర్ణయమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమరావతి పునఃప్రారంభంతో రాష్ట్ర అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## మోదీ శంకుస్థాపన చేసిన అమరావతిని ఆపే దమ్ము ఎవరికీ లేదు: మంత్రి నారా లోకేశ్

మొదటి పేజి తరువాయి



ఉద్యమంలో పాల్గొన్న రైతులపై అక్రమ కేసులు బనాయించారని, మహిళలపై దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో పోరాడిన రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. "ఆపడానికి, పీకడానికి అమరావతి ఎవరి ఇంట్లో పెరటి మొక్క కాదు, ఇది జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని" అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఇప్పుడు ఆపండి చూద్దాం...!

ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి అభివృద్ధి పనులు తిరిగి ఊపందుకున్నాయని, ఇక రాజధాని నిర్మాణాన్ని ఎవరూ ఆపలేరని ('అన్ స్టాపబుల్' అని) లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆపే దమ్ము ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కార్ ఉందని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడతాయని అన్నారు.

ఇక ఉద్యోగాల జాతరే!

రాబోయే ఐదేళ్లలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడం ద్వారా 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి లోకేశ్ తెలిపారు. ఇప్పటికే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామని గుర్తుచేశారు. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ (విశాఖపట్నం), ఆర్సెల్లార్ మిట్టల్ (అనకాపల్లి), బీపీసీఎల్ (రామాయపట్నం), ఎల్జీ ఎలక్ట్రానిక్స్ (తిరుపతి), రెన్యూవబుల్ ఎనర్జీ (రాయలసీమ), రిలయన్స్ సీబీజీ (ప్రకాశం), ఫార్మా, ఐటీ (ఉత్తరాంధ్ర) వంటి ప్రాజెక్టుల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు.

వంద పాకిస్థాన్ లు వచ్చినా బదులిచ్చేందుకు ఒక్క మిస్సైల్ ఉంది.. దాని పేరు...!: నారా లోకేశ్

ఉగ్రదాడులతో భారత గడ్డపై గడ్డి కూడా పీకలేరని వ్యాఖ్యలు

అమరావతి పనుల పునః ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రసంగించారు. ఇటీవల జమ్మూకశ్మీర్ లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు తన సంతాపం తెలియజేశారు. 100 పాకిస్థాన్ లు వచ్చినా, దీటుగా బదులిచ్చేందుకు మన వద్ద ఒక్క మిస్సైల్ ఉంది... ఆ మిస్సైల్ పేరు నమో (నరేంద్ర మోదీ) అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.

గడ్డి కూడా పీకలేరు!

"వారు భారతగడ్డపై గడ్డి మొక్క కూడా పీకలేరు. సింహం ముందు ఆటలు ఆడకూడదు... ఆడితే ఏమవుతుంది... మన నమో దెబ్బకు వరల్డ్ మ్యాప్ నుంచి పాకిస్థాన్ మిస్సింగ్ కావడం ఖాయం. ఈరోజు పాక్ ఆర్మీలో పనిచేసేవారు కొందరు రాజీనామాలు చేశారు, కొందరు సెలవు పెట్టి వెళ్లిపోయారు... నమో కొట్టే దెబ్బకు పాకిస్థాన్ దిమ్మదిరిగిపోవడం ఖాయం. ఇవాళ యావత్ దేశం మన నమో వెంట నిలుస్తోంది. కేంద్రం ఇవాళ కులగణన చేయాలని నిర్ణయించింది. ఇది ఒక నిర్ణయం కాదు... ఇది ఒక సంచలనం. కులగణన చేయడానికి చాలామంది దశాబ్దాలుగా వెనుకాడుతుంటే, మన నమో ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారు. నమోకు మన అమరావతి అంటే ఎంతో ప్రేమ. ఆయన ఢిల్లీలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, మన అమరావతి కోసం వచ్చారు. ఆయన ఏపీకి కావాల్సినవన్నీ అందిస్తున్నారు, కోరిన కోర్కెలు తీర్చుతున్నారు. మొన్ననే విశాఖపట్నం వచ్చి రైల్వే జోన్, ఎన్టీపీసీ, నక్కపల్లి డ్రగ్ పార్క్ కు నిధులు కేటాయించారు. ఏకంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ఆదుకున్నారు. ఇప్పుడు అమరావతి వచ్చి నిధులే కాదు పనులు కూడా ప్రారంభించబోతున్నారు" అని లోకేశ్ వివరించారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక
శనివారం -03 -మే-2025

## ఎస్ ఎస్ సి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించిన ఎంఈఓ, ఎంపీడీవో

ఆత్మకూర్ /వనపర్తి జిల్లా ప్రతినిధి/ మే 2/ ( జనం రిపోర్టర్ ) : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎస్ఎస్సి పరీక్షల్లో శ్రీవాణి హై స్కూల్, విద్యార్థిని పి పూజ 577/600 మార్కులతో ఉమ్మడి మండలాలలో ఆత్మకూర్, అమరచింత మండలాలలో ప్రథమ స్థానము పొందిన నేపథ్యంలో ఎంఈఓ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీపాద ,ఎంఈఓ శ్రీ బాలరాజు అధిక మార్కులు వచ్చిన శ్రీవాణి హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులను సన్మానించడం జరిగినది. శ్రీవాణి హైస్కూల్లో బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థి ఎస్ నిఖిల్ 571/600 మార్కులు, ఎండి జావిద్ 571/600 మార్కులు సాధించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విద్యార్థులను సన్మానించడం జరిగినది.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యజమాన్యం కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.శ్రీవాణి హై స్కూల్ సలహాదారులు, డాక్టర్ ఎం రాములు, విశ్వేశ్వర్ పాఠశాల ప్రిన్సిపాల్ లత మేడం,గంగాధర్ అభిలాష గారు ఎంపీడీవో కార్యాలయ సూపరిండెంట్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.ఎస్ఎస్సి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులు,శ్రీ వాణి హై స్కూల్ ఆత్మకూరు నందు 2024- 25 సంవత్సరం లో బెస్ట్ అవైలబుల్ విద్యార్థులు 18 మందిపరీక్షకు హాజరు కాగా,18 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణత సాధించారు. . నిఖిల్ -571. అంకిత -557.సమత -555, రాకేష్ -527, ఆనంద్ -520, ఝాన్సీ -501, వీరు 500 పై గా మార్కులు సాధించినారు.వీరితో పాటు 400 పై గా మార్కులు సాధించిన విద్యార్థులు 9 మంది , మరియు 300 పై గా మార్కులు సాధించిన విద్యార్థులు 3 . 18 మంది విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించినందుకు తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేసి పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపినారు.

## పొన్నూరు మండల ఎంఈఓ 2 గా విజయ భాస్కర్ ..

పొన్నూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు జిల్లా పొన్నూరు మండల విద్యాశాఖ అధికారిబి 2 గా కే .విజయభాస్కర్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాసరెడ్డి పదవీ విరమణ పొందడంతో కాకుమాను మండలం ఎంఈఓ గా పని చేస్తున్న కే. విజయ భాస్కర్ పొన్నూరు ఎంఈఓ గా నియమించబడ్డారు. ఈ సందర్భంగా పొన్నూరు ఎస్ టి యుశాఖ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలదించారు. పలు ఉపాధ్యాయ సమస్యలు వారికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీ సూరిసెట్టి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు బొర్రా రామారావు , పొన్నూరు మండల అధ్యక్షులు షేక్ నయీం, ప్రధాన కార్యదర్శి బి. హనుమంత ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి కె. సత్యనారాయణ, యన్. చిన బాబు, షేక్ నూరుద్దీన్, పుట్ల రవి ,తదితరులు పాల్గొన్నారు.

## కిషోర్ బాలికలకు వేసవిలో శిక్షణ

రేపల్లె. ( జనం రిపోర్టర్ ) : బాపట్ల జిల్లా మహిళా అభిరుద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో రేపల్లె ఐసీడీస్ ప్రాజెక్ట్ పరిధిలో గల రేపల్లె మండలం, నగరం మండలం మరియు రేపల్లె మున్సిపాలిటీ ల నందు ఈ రోజు కిషోరి వికాసం సమ్మర్ కాంపెయిన్ ను అన్ని గ్రామాలలో లాంచ్ చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు వ్యక్తుల మధ్య సత్సంభందాలు గురుంచి వీడియో చూపించి తదుపరి కార్యాచరణ గురుంచి చర్చించుకోవటం జరిగింది.మే 2 న్డ్ నుండి జూన్ 10 వరకు ప్రతి మంగళ, శుక్రవారాలు 11- 18 సంవత్సరములు గల కిషోరిబాలికలు ఈ కార్యక్రమము నందు పాల్గొనవచ్చును.మొత్తం 16 సెషన్స్ జరుగుతాయి.ఈ రోజు రేపల్లె మున్సిపాలిటీ లోని శివాజీ స్కూల్ నందు పాల్గొనటం జరిగింది ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఏం సుచిత్ర సూపర్వైజర్లు టీ నాంచారమ్మ వెంకటేశ్వరమ్మఎం సుచిత్ర సీడీపీఓపి నాంచారమ్మా. సూపర్ వైసర్ర్ వెంకటరత్నమ్మ అంగన్వాడీ కార్యకర్తలు కిషోర్ బాలికలు పాల్గొన్నారు

## అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు

రేపల్లె. ( జనం రిపోర్టర్ ) : ప్రోహిబిషన్ మరియు ఎక్సజ్ శాఖ, రేపల్లె స్టేషన్ పరిధిలో గల భట్టిప్రోలు మండలం లో శుక్రవారం ప్రోహిబిషన్ %డ% ఎక్సజ్ శాఖ సీఐ దివాకర్ మరియూ వారి సిబ్బంది కలిసి భట్టిప్రోలు మండలం లో అన్ని గ్రామాలయందు అక్రంగా మద్యం అమ్ముతూ బెల్ట్ షాప్స్,నిర్వహిస్తున్న మరియు మద్యం షాప్స్ చూటుపక్కల మద్యం సేవిస్తున్న వారి పై విస్తృతముగా తనిఖీ లు చేయడమైనది. తనిఖీలలో భాగంగా భట్టిప్రోలు మండలం లో ని మద్యం షాపు ల నందు ధరలు పట్టిక మరియు 21 సంవచ్చా రాలు నిండిన వ్యక్తులు కు మాత్రమే అమ్మబడును అనే బోర్డ్స్ తనిఖీచేయడమైనది, ఆ బోర్డ్స్ అన్ని షాపుల వారు పూర్తి స్థాయి లో ఏర్పాటు చేయడమైనది. అనుమతించి న షాపు ల పరిధిలో మద్యం సేవించుటలేదు.పల్లెకోన గ్రామమం లో మద్యం అమ్ముతున్న వ్యక్తి సోమ్మంశెట్టి శ్రీనివాసరావు తండ్రి సుబ్బారావు, ని అదుపులోకి తీసుకోవడమైనది అతని వద్ద 180 %ఎమ్ఎల్%,10 సిల్వర్ ట్రిప్స్ విస్కీ మద్యం సిసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేయడమైనది. నూతన మద్యం పాలసీ 24-26 అమలునుడి నేటి వరకు ప్రోహిబిషన్ మరియు ఎక్సజ్ శాఖ రేపల్లె స్టేషన్ పరిధిలో మొత్తం 35 కేసులు నమోదు చేయడమైనది. భట్టిప్రోలు మండలం పరిధిలో 17 కేసులు నమోదుచేయడమైనది. అక్రమ మద్యం, అక్రమ సారాయి, బెల్ట్ షాపు లు నిర్వహించువారి వివరములు ప్రోహిబిషన్ మరియు ఎక్సజ్ శాఖ రేపల్లె స్టేషన్ కు ఈ ఫోన్ నెంబర్ 9440902476 నకు తెలియపర్చవలెను, తెలియపర్చునవారి వివరాలు గొప్యం గా ఉంచబడతాయి అనే తెలియజేయడమైనది.

## ఆదాయం చూస్తే లక్షల్లో !! సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రమే...



నార్పల ( జనం రిపోర్టర్ ) : అనంతపురం జిల్లా కేంద్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రముగా నార్పల మండలానికి చెందిన గూగూడు గ్రామంలో వెలసిన శ్రీ గుగుడు కుళ్లాయస్వామి క్షేత్రము ఎంతో ప్రముఖమైనదని అందరికీ తెలిసిందే. కుళ్లాయస్వామిని సందర్శించడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన కర్ణాటక నుంచి కూడా భక్తులు వస్తుండటం విశేషం. ఇంతటి ప్రాముఖ్యత గల పుణ్యక్షేత్రములో స్వామి సందర్శనార్థం వచ్చిన భక్తులకు తీవ్ర అసౌకర్యాలు దర్శనమిస్తాయి. ప్రతి గురువారం కుళ్లాయస్వామి ఆలయము నందు దూరప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు నిద్ర చేయటానికి వస్తారు. వచ్చిన భక్తులకు తీవ్రమైన అసౌకర్యాల నడుమ నిద్రించి వెళుతున్నామని భక్తులు వాపోతున్నారు. వందలాది మంది భక్తులకు ఆలయ సమీపంలో కేవలం రెండు బాత్రూములు, రెండు మరుగుదొడ్లు ఉన్నవి. ఒకరు బాత్రూమ్ ని వినియోగించుకుంటే 10 రూపాయలు చెల్లించాల్సిందే, అదేమిటని ప్రశ్నిస్తే మేము వేలంపాటలో లక్ష రూపాయలు ప్రభుత్వానికి ఇచ్చినాము, అందుకే పది రూపాయలు తీసుకుంటున్నామని బాత్రూముల అజామాయిషీదారులు భక్తులకు తెలిపారు. దేవాదాయ శాఖ కింద ఉన్న కుల్లాయస్వామికి చక్కెర ముడుపు కిందనే, హుండీ ద్వారా, తలనీలాల తదితర మార్గాల ద్వారా లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరుతుందనేది బహిరంగ రహస్యం. వచ్చిన ఆదాయాన్ని సరిగ్గా ఆలయ అభివృద్ధికి, భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి వినియోగించాలి. కానీ ఇక్కడ అభివృద్ధికి బదులు సొంత లాభాపేక్ష, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారి నిర్లక్ష్యం వహించడం, సమస్యలను ఆలయ అధికారి దృష్టికి తీసుకెళ్తే కనీసం చీమకుట్టినట్లైనా ఉండకపోవడం గమనార్హం. కేవలం మొహరం ఉత్సవాలలో మాత్రమే గూగూడు లోని కొత్త బావికి ఎదురుగా ఉన్న బాత్రూములను మరియు మరుగుదొడ్లను వినియోగిస్తుండటం విశేషం. నిరంతరం ఈ బాత్రూములను మరుగుదొడ్లను భక్తుల సౌకర్యార్థం వినియోగిస్తే కొంతవరకు భక్తులకు మేలు కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కనీసం ఇప్పటికైనా ఆలయ అధికారి, ఆలయ సభ్యులు స్వామివారి సందర్శనానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలని కల్పించాలని భక్తుల కోరారు.

## భారత రాష్ట్ర సమితి ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు



అమరచింత /వనపర్తి జిల్లా ప్రతినిధి/ మే 2 ( జనం రిపోర్టర్ ) : అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని భారత రాష్ట్ర సమితి జండా కట్ట వద్ద ఆ పార్టీ ట్రేడ్ యూనియన్ నాయకులు శుక్రవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు అబ్రహం మేడే జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 8 గంటల పని దినాల హక్కు కోసం కార్మికులు పోరాడి అసువులు బాసి నేటికీ 139 సంవత్సరాలు దాటిందని అన్నారు. ఆనాడు కార్మికుల రక్తంతో తడిసిన ఈ గుడ్డని మేడే జెండాగా రూపుదిద్దుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలు రాస్తున్నాయని ఆరోపించారు. పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రపంచ కార్మికులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కార్యదర్శి చిన్న బాలరాజు కార్మికుల సమస్యలపై వాటి పరిష్కారం పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎస్సే రాజు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ బి ఆర్ ఎస్ వి నాయకులు మారే డ్డి నరేష్ రెడ్డి, ఏపీ రాజేందర్ పురుషోత్తం గోపాల్ నాయక్ యువరాజు పెద్ద బాలరాజు రఘు యోహాన్, కోరి శ్రీను, సర్దార్ బేగ్, యువరాజు, డ్రైవర్ శ్రీను, రఘు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జూన్ 5న యూపిఎస్సీ- సిఎస్ఎటి పరీక్ష శిక్షణ కొరకు ప్రవేశ పరీక్ష ......

### మే 24 లోపు సివిల్స్ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకోవాలి... జిల్లామైనారిటీ సంక్షేమ అధికారి జే.రంగారెడ్డి.....

రామగుండం ( జనం రిపోర్టర్ ) : జూన్ 05న యూపిఎస్సీ-సిఎస్ఎటి పరీక్ష శిక్షణ కొరకు ప్రవేశ పరీక్ష నిర్వహణ ఉంటుందని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జే.రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు యూపిఎస్సి సిఎస్ఎటి 2026 పరీక్ష కోసం 100 మంది మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌ను నిర్వహిస్తోందని, ఇట్టి శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5 శాతం సీట్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు.హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్ లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు అందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 5లక్షల రూపాయలకు మించకూడదని తెలిపారు. యుపిఎస్సి (సిఎస్ఎటి -2026) యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ/ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థుల దరఖాస్తులు ఆన్‌లైన్ ఎచ్ టిటిపిఎస్://టి ఎంఆర్ఇఐ ఎస్ వెబ్ సైట్ ద్వారా మే 24 లోపు స్వీకరిస్తామని అన్నారు. యుపిఎస్సి (సిఎస్ఎటి -2026) శిక్షణ కోసం స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష జూన్ 5న ఉదయం 10.30 నుండి 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల, రంగంపల్లిలో నిర్వహించబడు తుందని, ఇతర వివారాలకు ఆన్‌లైన్ ఇతర వివరాలకు ఫోన్ నెం. 040-23236112 లో పని దినాలలో సంప్రదించాలని జే.రంగా రెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

## ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్స్ రౌండ్ టేబుల్ సమావేశం





పెద్దకాకాని ( జనం రిపోర్టర్ ) : పిలుపులో భాగంగా ఈరోజు పెదకాకాని సిపిఐ కార్యాలయము నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది 20వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ పొన్నూరు నియోజకవర్గ ఏ ఐ టి యు సి కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాల్లో మార్పు చేసి దశాబ్దాల కాలం పాటు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడులు తీసుకొచ్చి కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేయటంతో పాటు కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా నిర్ణయాలు ఉన్నాయని కష్టపడి ఉత్పత్తి సృష్టించే కార్మికులకు ఉద్యోగులకు పేదలకు పెద్ద ఎత్తున నష్టం జరిగే విధంగా చట్టాల్లో మార్పు చేశారని అనేక పోరాటాల ఫలితంగా సాధించిన ఎనిమిది గంటల పని దినాలు అమలు చేయట్లేదని కార్మికులు 12 గంటలు పని చేయాల్సి వస్తుందని కనీస వేతనం పిఎఫ్ ఈఎస్ఐ గ్రాడ్ డ్యూటీ ఉద్యోగ భద్రత ఇలాంటివి ఏమి అమలు కావటం లేదని పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర సరుకులు ధరలు పెరిగాయి అని ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసి పోస్టల్ రైల్వే ఓడరేవులు పోర్టులు ప్రైవేటీకరణ చేశారని 32 మంది విద్యార్థి యువజనుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు లాంటి సంస్థలని ప్రైవేట్ పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు రవణా శాఖ కార్యాలయాలు ప్రైవేటు పరం చేయటం జరిగింది అన్నారు మోటార్ వాహనాల చట్టంలో సవరణలు చేయడం డ్రైవర్లకు భారీ మొత్తంలో పెనాల్టీలు జైలు శిక్షలు లాంటి న్యాయ సంహిత చట్టం106(1)%డ%2 ప్రమాదకరమైన చట్టాలు చేశారని రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ ని రద్దు చేయాలని మే 20వ తేదీన కార్మిక కర్షక ప్రజాసంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు ఉద్యోగులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోటిపల్లి సత్యనారాయణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉల్లంగుల శివయ్య సిపిఐ దర్శి లింగారావు రామిశెట్టి శ్రీనివాసరావు గోపి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

## దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న విద్యుత్ కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : కలెక్టర్ (జనం రిపోర్టర్) : కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విద్యుత్ శాఖలో పెండింగ్ లో ఉన్న వివిధ అంశాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారంజిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పెండింగ్ విద్యుత్ పనులు వేగవంతం చేయాలన్నారు. 2024 సంవత్సరం ఉన్న పెండింగ్ లో ఉన్న సమస్యలు మే నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ట్రాన్స్ ఫార్మర్లు, స్తంబాలు, మీటర్లు, బోరు కనెక్షన్ లు సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహించ కుండా పనులు పురోగతి సాధించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పనులు అలసత్వం చేయకూడదని అధికారులకు సూచించారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, విద్యుత్ ఎస్ఇ రవి ప్రసాద్, డిఇ, ఎడిఇ, ఎఇలు పాల్గొన్నారు.

## అమరావతిపై ప్రధాని మోదీ ఉత్తుత్తి హామీలు...



పొన్నూరు(జనం రిపోర్టర్) :విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం , మోదీ ఉత్తర కుమార ప్రగల్భాలు, ఉత్తుత్తి హామీలు పక్కనపెట్టి నిజాయితీగా నిధులు కేటాయించాలని పొన్నూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అందే దిలీప్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర రాజధాని పనుల పునఃప్రారంభ సభలో ప్రధాని ప్రసంగం అనంతరం మోదీ ఇచ్చిన హామీలపై దిలీప్ స్పందించారు. సభలో మోదీ - చంద్రబాబుల వ్యవహారం నువ్వు నా భజన చెయ్యి నేను నీ భజన చేస్తా అన్నట్టుగా ఉందే తప్ప, ఈ సభద్వారా రాష్ట్రానికి ఒరిగేదేమి లేదని, చెల్లి పెళ్లి జరగాలి మళ్ళీ.. మళ్ళీ ..అన్నట్టుగా చంద్రబాబు - మోదీ లు రాష్ట్ర రాజధానికి మళ్ళీ మళ్ళీ శంఖుస్థాపనలు చేయటం సిగ్గుచేటన్నారు.2015 అక్టోబర్ 22వ తేదీన అప్పటి ఎన్డీయే ప్రభుత్వం తరపున దేశ ప్రధాని హోదాలో విచ్చేసిన ఇదే మోదీ ఈరోజు పలికినట్టే ఆరోజు కూడా ఉత్తర ప్రగల్భాలు పలికారని, వేల కోట్ల కేటాయింపులు, లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని మభ్యపెట్టి ఆంధ్రుల చేతికి గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చారని, ఇక గత జగన్ రెడ్డి ప్రభుత్వం ఒక కులంపై కక్షపూరితంగా వ్యవహరించటంతో అమరావతి రాజధాని లో ఒక్క ఇటుకా పేర్చకుండా ఐదేళ్లు ప్రజాకంతక పాలన సాగించిందన్నారు.ప్రతిపక్ష హోదాకి కూడా నోచుకోకుండా అధికారం కోల్పోయారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం మరోసారి అమరావతి రాజధాని విషయంలో ప్రజలను మభ్యపెట్టే ప్రయతంలో భాగంగానే మళ్ళీ ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభింపజేస్తుందని ఏరాష్ట్రంలో కూడా మోదీ ప్రసంగాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ప్రజలు కానీ విశ్వసించే పరిస్థితి లేదని, చివరకు గుజరాత్ రాష్ట్రంలో కూడా మోదీ మాటలకూ ప్రజా స్పందన సూన్యం అని, అటువంటి మోదీ తో సభలో మరోసారి ఉత్తుత్తి హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. 2015 నాటి కంటే ఎక్కువగా రాష్ట్రానికి 58 వేల కోట్ల ప్రాజెక్టులు కేటాయిస్తున్నట్టు మోదీ ప్రకటించారని, ఇవన్నీ వాస్తవ రూపం దాల్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర పార్లమెంటు సభ్యులు కంకణం కట్టుకు తిరగాలని, అప్పుడే కేంద్రం నుంచి కేటాయింపులు జరిగి అమరావతి నిర్మాణం జరుగుతుందని, ఇక విభజన హామీల అమలు విషయంలో మోదీ అన్నీ అవాస్తవాలు చెప్పారని, వారి మాటలకు వాస్తవ కేటాయింపులకు ఎక్కడా పొంతన లేదని, గత పదేళ్లలో మోదీ ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన నిధులు అన్ని రాష్ట్రాల కేటాయింపుల సగటు కంటే చాలా తక్కువ అని, మోదీ , పవన్ కళ్యాణ్ ల మతోన్మాదపు ధృతరాష్ట్ర కౌగిలి నుంచి చంద్రబాబు బయటపడిననాడే రాష్ట్రాభివృద్ధికి బీజం పడుద్దని, అప్పటిదాకా అదిగో అమరావతి, ఇదిగో అభివృద్ధి అని సభల్లో, సోషల్ మీడియా లో అవాస్తవాలు వండి వార్చటం తప్ప నిజమైన అభివృద్ధి సాధ్యపడదని దిలీప్ అన్నారు.



## 8000 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఎక్సైజ్ అధికారి సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్..!!

వికారాబాద్ జిల్లా ప్రతినిధి : మే 2 (జనం రిపోర్టర్) వికారాబాద్ జిల్లా పట్టణ కేంద్రంలో ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ 8000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్ అండ్ గా దొరికిన ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పట్టుకున్నారు. ఎక్సైజ్ కార్యాలయంలో పట్టుకొని కేసు నమోదు చేశారు.

## : సింగరేణిలో హామీల అమలులో ప్రజాపాలనకు నిదర్శనం ప్రజా ప్రభుత్వం...

### ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్.....





రామగుండం(జనం రిపోర్టర్) :రామగుండం:మే 02. రాష్ట్ర ప్రజా ప్రభుత్వ పాలనలో సింగరేణి కార్మికులకు న్యాయం జరుగుతోంది. సింగరేణిలో 35-40 సంవత్సరాల వయో పరిమితి పెంపును అమలు చేస్తూ, నియామక పత్రాలు రాష్ట ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ బి.జనక్ ప్రసాద్ , సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ల చేతుల మీదుగా 2025, మే 2న. ప్రజా భవన్‌లో కార్మికులకు అందజేశారుఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, “గత ప్రభుత్వం పదేళ్లుగా అమలు చేయని హామీని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు చేపట్టిన వెంటనే అమలు చేసి చూపింది. ఇప్పుడు సింగరేణిలో నియామకాలు, ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం అన్నీ వేగంగా సాగుతున్నాయి,” అని తెలిపారు.కార్మికుల సొంతింటి కల, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, మారుపేర్ల మార్పు, డిస్మిస్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ కోరగా, దానికి సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధిత నిర్ణయాలను త్వరితగతిన తీసుకుంటామని హామీ ఇచ్చారు.అంతిమంగా కార్మికులకు నియామక పత్రాలు అందజేస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆదివాసీలకు ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలని నిరసన



రాజవొమ్మంగి, ఏప్రిల్ 2 జనం రిపోర్టర్:ప్రత్యేక డిఎస్సీ పై ఏజెన్సీ ప్రాంతాల్లో గురువారం ఆదివాసీలు చేపట్టిన బంద్ ప్రభావంతో స్వచ్ఛందంగా దుకాణాలు,వస్తు సముదాయాలు మూతపడ్డాయి ఈ నేపథ్యంలో అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి మండల కేంద్రంలో అల్లూరి సెంటర్ వద్ద మండలంలోని ఆదివాసీలు ఆధ్వర్యంలో మనవహారం చేపట్టీ నిరసన వ్యక్తం చేశారు తొలుత ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి అల్లూరి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు గిరిజనులకు ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలని నినాదాలు చేశారు అనంతరం ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నేతలు మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్సీలో గిరిజన డిఎస్సీ అభ్యర్థులకు తీరని నష్టం వాటిల్లిందని వాపోయారు ఏజెన్సీలో ఉన్న గిరిజన ఆదివాసీలకు ప్రత్యేక డిఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు జీఓ నెంబర్ 3 పునరుద్ధరించాలని పేర్కొన్నారు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గిరిజన హామీలను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి,జెడ్పీటీసీ వడుగుల జ్యోతి,కోండ్ల సూరిబాబు,గంపా నాగరాజు,వంతు బాలకృష్ణ,తాము సూరిబాబు,వజ్రపు అప్పారావు,కొంగర మురళీకృష్ణ, సింగిరెడ్డి అచ్చారావు,ఈక శ్రీనివాస్ తోపాటు మండల గ్రామ ప్రజాప్రతినిధులు,పలు పంచాయతీల సర్పంచ్లు,ఆదివాసీ సంఘాల ప్రతినిధులు,పీసా కమిటీ సభ్యులు,ప్రజా సంఘాల నేతలు,పెద్ద సంఖ్యలో ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ ఎన్ సన్యాసినాయుడు,ఎస్ఐ ఇ నరసింహ మూర్తి అధ్యక్షతన పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## ప్రభుత్వ అధికారులను కాపాడుకుందాం....

### పెద్దపల్లి,జిల్లా వైద్య శాఖ అధికారి శ్రీమతి అన్న ప్రసన్న కే, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, సంపూర్ణ మద్దతు....



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:మే 02. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ, నిబంధన మేరకే పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ వైద్య శాఖ అధికారి అన్న ప్రసన్న, గోదావరిఖని పట్టణంలోని మమత హాస్పిటల్,ను తనిఖీ చ చేశారని, దాన్ని కొంత మంది రాజకీయ నాయకులు రాద్ధాంతం చేయడం సరికాదని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం వారికి హితవు పలికింది. శుక్రవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్లో డి ఎం అండ్ హెచ్ ఓ, అన్న ప్రసన్నను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ రాష్ట్ర స్థాయి నాయకులు కలిశారు, పెద్దపెల్లి జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులను జిల్లా అధికారిగా తనిఖీ చేస్తే తప్పు ఏందని, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు కుర్మపల్లి మాజీ సర్పంచ్, మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకే జిల్లా వ్యాప్తంగా వైద్యశాఖ అధికారి అన్న ప్రసన్న తనిఖీ చేస్తుందని, అందులో భాగంగానే గోదావరిఖని పట్టణంలోని మమత హాస్పిటల్,ను, తనిఖీ చేశారని అన్నారు.2923 లో గర్భిణీ స్త్రీలకు లింగ నిర్ధారణకు సంబంధించిన స్కానింగ్ మిషన్ ఏర్పాటుచేసి ఎలాంటి అనుమతి లేకుండా నడిపిస్తుంటే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ స్కానింగ్ మిషన్ ను నడిపిస్తున్న ఆసుపత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, కొంతమంది రాజకీయ నాయకులు వారికి మద్దతు తెలపడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారికి రాజకీయ నాయకులు మద్దత అంటూ ప్రశ్నించారు. తన విధిలో భాగంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య శాఖ అధికారికి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.తప్పుడు మార్గంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్న నిర్వాహకులకు మద్దతు తెలుపుతున్న రాజకీయ నాయకులు మరోసారి ఆలోచన చేయాలన్నారు, అక్రమంగా డిఎం అండ్ హెచ్ ఓ పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిమాజీ కలెక్టర్,కు విజ్ఞప్తి చేశారు. మాజీ మేయర్, డాక్టర్ బంగి అనిల్ కుమార్ ను, మాజీ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామిని మమత ఆసుపత్రి నిర్వాహకులు పాములుగా వాడుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు జీవితాన్ని 2023 నుండి, నిర్ధారణల మిషన్ వినియోగిస్తున్న ఆసుపత్రిని తక్షణమే సీజ్ చేసి, ఇరువాకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ని కూడా కలిశారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును, కూడా కలవనున్నట్లు వారు వెల్లడించారు. పెద్దపెల్లి జిల్లా వైద్య శాఖ అధికారిని కలిసిన వారిలో, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్, మామిడిపల్లి బాపయ్య , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బిజినెస్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, జిల్లా కో కన్వీనర్ సంకనపల్లి లక్ష్మయ్య బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంఘాల పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కట్టుకూరి సందీప్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపెల్లి మండల అధ్యక్షులు, బొసెల్లి నారాయణ, కన్నూరి బాపు, కాటుకూరి సంతోష్, కనుకుంట్ల రమేష్, తదితరులు ఉన్నారు.

## కనీస వేతనాల సలహా బోర్డును ఏర్పాటు చేయాలి



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : కనీస వేతనాల సలహా బోర్డును తక్షణమే ఏర్పాటు చేసి పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 35 వేలుగా ఈ నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి కేంద్ర కమిటీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 5న రేపల్లె రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద కార్మికులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెరుగుతున్న ఇంటి అద్దెలు ఇతర అవసరాల దృష్ట్యా ఒక కుటుంబం గౌరవ ప్రధంగా జీవించాలంటే నెలకు కనీస వేతనం రూ. 35 వేలుగా నిర్ణయించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డును తక్షణమే ఏర్పాటు చేసి కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి కనీస వేతనాలను నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ ఐదో తేదీ ఆర్డిఓ కార్యాలయం వద్ద జరుగుతున్న ధర్నాలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాగాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఎఐటియుసి నాయకులు సిహెచ్. శివశంకర్, రైతు సంఘ నాయకులు సజ్జా రాజ బాపయ్య తదితరులు పాల్గొన్నారు...

## మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు
## ఎల్టిపీ లైసెన్సుల కొరకు దరఖాస్తు చేసుకోవాలి



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : గృహ నిర్మాణ అనుమతులు వేగవంతంగా ఇచ్చేందుకు ప్రభుత్వం ఎల్టిపి నియామక ప్రక్రియను చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. ఇందులో భాగంగా లైసెన్స్ టక్నికల్ పర్సన్స్ ను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ రంగ అనుమతులు టౌన్ ప్లానింగ్ సిబ్బంది చుట్టూ తిరగకుండా ఎల్టిపిల వద్ద దరఖాస్తు చేసుకొని అక్కడే ఫీజులు చెల్లించి తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందనరు. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్, లేదా డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ చేసిన అభ్యర్థులు ఎల్టిపీలుగా లైసెన్సుల కొరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు లైసెన్స్ పొందిన అభ్యర్థులకు పురపాలక సంఘ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ అనుమతులు ఎలా ఇవ్వాలి అనే దానిపై శిక్షణ ఇచ్చి లైసెన్సులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## గుడిపల్లి వాణి ఆధ్వర్యంలో
## నెహ్రూ నగర్ నుండి భారీ గా తరలిన నాయకులు



గుంటూరు ( జనం రిపోర్టర్ ) : ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మొహమ్మద్ నసీర్ గారి ఆధ్వర్యంలో వేలాది మంది అమరావతి పున: ప్రారంభోత్సవానికి బయలుదేరినారు.అలాగే నెహ్రూనగర్ మెయిన్ రోడ్డు 4వ లైన్ దగ్గర నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు మహిళ సెక్రెటరీ గుడిపల్లి వాణి ఆధ్వర్యంలో బయలుదేరినారు.ఈ కార్యక్రమంలో యద్దల రమేష్,గుడిపల్లి నవీన్ కృష్ణ అడ్వకేట్,వీరిశెట్టి వినోద్,అరవపల్లి శ్రీను,యేమినేడి శేషయ్య,ఉప్పుకుంట్ల నారాయణ,బత్తుల జయమ్మ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అనేక మంది పార్టీ అభిమానులు కార్యక్రమానికి భారీ స్థాయి లో తరలి వెళ్ళినారు.

## ఎల్టిపీ లైసెన్సుల కొరకు దరఖాస్తు చేసుకోవాలి



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : గృహ నిర్మాణ అనుమతులు వేగవంతంగా ఇచ్చేందుకు ప్రభుత్వం ఎల్టిపి నియామక ప్రక్రియను చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. ఇందులో భాగంగా లైసెన్స్ టక్నికల్ పర్సన్స్ ను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ రంగ అనుమతులు టౌన్ ప్లానింగ్ సిబ్బంది చుట్టూ తిరగకుండా ఎల్టిపిల వద్ద దరఖాస్తు చేసుకొని అక్కడే ఫీజులు చెల్లించి తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందనరు. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్, లేదా డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్ చేసిన అభ్యర్థులు ఎల్టిపీలుగా లైసెన్సుల కొరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు లైసెన్స్ పొందిన అభ్యర్థులకు పురపాలక సంఘ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ అనుమతులు ఎలా ఇవ్వాలి అనే దానిపై శిక్షణ ఇచ్చి లైసెన్సులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మేడే ఉత్సవాల్లో రాజకీయాలా...?
## కార్మిక సంక్షేమం -
## కనీస వేతనాల పెంపును విస్మరించిన ప్రభుతం....

### గెలిచిన ట్రేడ్ యూనియన్స్ మా కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకోరా...?
### ప్రసంగాలకు పరిమితమైన పర్మినెంట్ కార్మిక సంఘాలు...
### తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 02. రాష్ట్రంలో ఎంతో ఆశతో ఎదురుచూసిన కార్మిక వర్గాన్ని మేడే ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం పర్మినెంట్ కార్మిక సంఘాలు ఇచ్చిన మేడే సందేశం నిరాశపరచింది. సింగరేణి, లో ప్రధాన భూమిక పోషించిన సింగరేణి హాస్పిటల్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, స్టాఫ్ నర్సులు, ప్లంబర్స్, లాప్ టెక్నిషన్స్, డయాలసిస్ టెక్నీషియన్స్, ఎక్స్రే టెక్నీషియన్స్, ఆయాలు, సిపర్స్, ప్లంబర్ కర్మాగారం నుండి కోవిడ్ సమయంలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా ప్రాణాలకు తెగించి, పర్మినెంట్ కార్మికుల కుటుంబాలకు సింగరేణి అధికారులకు ఇరవేణి సేవలు చేశారు. వీరిని కూడా విస్మరించడం చాలా బాధాకరమైన విషయము అదే కాకుండా సింగరేణిలో పనిచేస్తున్న మా కార్మికులకు గిగ్ వర్కర్స్ గురించి నామమాత్రపు ప్రస్తావన చేసి, రాష్ట్రలో కార్మిలు ఎదుర్కొంటున్న షెడ్యూల్ పరిశ్రమల కార్మికుల కనీసం వేతనాల పెంపు జీవోల జారీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యగ భద్రత,



పర్మినెంట్, స్కీమ్ వర్కర్స్ కి వేతనాల పెంపు, గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీ పర్పస్ వర్కర్స్ విధానం రద్దు, మునిసిపల్ కార్మికులకు వేతనాల పెంపు, హమాలి, ప్రవేట్ ట్రాన్సపోర్టు కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు లాంటి ప్రధాన సమస్యలను మరుగున పెట్టి మేడే ఉత్సవాల్లో రాజకీయాలాడటం సరైంది కాదని, తెలంగాణ. కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ అభిప్రాయపడుతుందని,తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అమరచింత/ వనపర్తి జిల్లా ప్రతినిధి/ మే 2 ( జనం రిపోర్టర్ ) : వారంతా అమరచింత జిల్లా పరిషత్ హై స్కూల్లో 2004-05 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు ఈ సమ్మేళనానికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించారు ఆత్మీయ సమ్మేళనంలో ఆనాటి మధుర జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు నెమరు వేసుకున్నారు ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఆత్మీయ సమ్మేళన కోసం పాఠశాలకు చేరుకున్నారు పూర్వ విద్యార్థులు వ్యక్తిగతంగా తమను పరిచయం చేసుకొని ఏ ఏ హొదాలో ఉన్నారో తోటి విద్యార్థులకు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు విశ్రాంత ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు మాత్రమే ఇటువంటి అవకాశం లభిస్తుందని అన్నారు తమతో విద్యార్థులు నేర్చుకొని ఇంతటి స్థాయిలో ఉన్న విద్యార్థులను చూసి తమ గర్విస్తున్నామని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరు కలిసి గ్రూప్ ఫోటో తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్రాంత ఉపాధ్యాయులు ఎంఈఓ భాస్కర్ సింగ్ హెచ్ఎం లింగన్న సుదర్శన్ పీఈటి చంద్రశేఖర్ చెన్నారెడ్డి రియాజుద్దీన్ రాజేంద్రప్రసాద్ మహేశ్వర సుదర్శన్ రెడ్డి కవిత మేడం పూర్వ విద్యార్థులు సురేష్ రఘురామిరెడ్డి విజయ ఇంతియాజ్ ,బాబు రెడ్డి, సునీల్, సురేష్, కృష్ణ నాయక్, తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి మోడీ సభకు భారీగా తరలి వెళ్ళిన ప్రజలు





నిజాంపట్నం ( జనం రిపోర్టర్ ) : అమరావతి రాజధాని అభివృద్ధి పనులు శంకుస్థాపన కార్యక్రమానికి జడ్పిటిసి సభ్యులు నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం బయలుదేరిన కూటమి శ్రేణులు శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాజధాని అమరావతిలో నిర్మించనున్న శాశ్వత భవనాలకు పనులు శంకుస్థాపనకు అమరావతి విచ్చేయుచున్న మన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు నిజాంపట్నం నుండి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు నిజాంపట్నం నుండి వాహనాలతో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ బోట్లు అసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు నాయుడు గోపాలకృష్ణ (గోపి), బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు పచ్చ పట్ల గంగరాజు, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కొనికి వెంకట్రావు, మరియు నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## : కులగణనతో దేశంలో సామాజిక ఐక్యత బలపడుతుంది
## కులగణనకు కాంగ్రెస్,వామపక్షాలు తొలినుంచీ వ్యతిరేకం...



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:మే 02. భారతదేశ వ్యాప్తంగా జనగణన తో పాటే కుల గణనను చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, బీజేపీ ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు అందమల్ల ఆనంద్ గౌడ్ సూచనల మేరకు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో, గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో, రామగుండం నియోజకవర్గం ఇంచార్జి కందుల సంధ్యారాణి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హనుమంతు గౌడ్. ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ ముదిరాజ్, బిజెపి నాయకులు మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేయడం జరిగినది. రామగుండం నియోజకవర్గం ఇన్చార్జి కందుల సంధ్యారాణి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ,దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణనను చేపట్టాలని మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. పారదర్శకతతో దేశవ్యాప్తంగా కులగణన చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనాలకంటే సామాజిక అభివృద్ధికే పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించింది.కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు వారి స్వార్ధ రాజకీయ కారణాలతో కులాల లెక్కలు తీశాయి.ఇలాంటి వాటితో సమాజంలో సందేహాలు చాలా ఉంటాయి.కానీ మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వందేశంలో సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండాలన్న లక్ష్యమే ధ్యేయంగా కులగణను చేపట్టడం జరుగుతుంది.కులగణనకు కాంగ్రెస్ తొలినుంచీ వ్యతిరేకం .బిజెపి ప్రభుత్వం జరిపే జన, కులగణనతో దేశం పటిష్ఠంగా మారుతుంది.ఏ వర్గాన్నీ నొప్పించకుండా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను మేం తీసుకొచ్చాం అదేవిధంగా అందరికీ న్యాయం జరిగేలా కుల గణన ఉంటుందని కేంద్ర సమాచార మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పడం జరిగింది అన్నారు. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలతోపాటే కులగణనను నిర్వహించాలని తీర్మానించారు. తెలంగాణ, కర్ణాటకల్లో కులగణన కాంగ్రెస్ జరిపిన కుల అస్తవ్యస్తంగా ఉంది.అది కేవలం వారి రాజకీయంగా స్వార్థం కోసం చేశారు ఆని అన్నారు.స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చేపట్టిన జనాభా లెక్కల్లో కులగణనను చేర్చలేదు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కుల గణనపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆమేరకు లోక్‌సభకు హామీ ఇచ్చారు. కానీ, మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, కులగణనకు బదులు సామాజిక ఆర్థిక సర్వే (ఎసఈసీసీ) -2011ను నిర్వహించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి కులగణనను వాడుకుంటున్నాయి అని ఆయన ఆరోపించారు.జనగణన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అన్నారు. జనగణన రాజ్యాంగం బద్దంగా చేస్తోంది అన్నారు. రాజకీయాల వల్ల మన సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండేందుకు కులగణనను జనాభా లెక్కల్లో భాగంగా పారదర్శకంగా నిర్వహించాలని, కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది"



అన్నారు. ఉత్తుత్తి సర్వేలు జరపడం తమ లక్ష్యం కాదని తెలిపారు. తాము జరిపే జనగణన, కులగణనతో దేశ సామాజిక, ఆర్థిక నిర్మాణం పటిష్ఠం అవుతుందని, దేశం అభివృద్ధి పథంలోకి పయనిస్తుందన్నారు. దేశ, సమాజ ప్రయోజనాలకు, విలువలకు మోదీ ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో ఈ నిర్ణయంతో స్పష్టమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోమల మహేష్, జక్కుల నరహరి, మత్స్య విశ్వాస్, బిజెపి మండల అధ్యక్షులు కోడూరు రమేష్, గుండు బోయిన భూమయ్య, మిట్టపల్లి సతీష్ కుమార్, బోడకుంట సుభాష్, తోట కుమార్, పల్లికొండ నర్సింగ్. తడగొండ నరసయ్య, అంద రాజకుమార్, బుంగ మహేష్. శివరామకృష్ణ, ఇరుగురాల శివకుమార్, కాదాసి శంకర్, మామిడి వీరేశం, మంద రాజేష్, దండు పవన్, ప్రవీణ్, పద్మ, అపర్ణ, సుద్దాల సాయి చరణ్, మబ్బు శివ, అయితే పవన్, శివకుమార్, తోకల రాజు, కన్నూరి రజుకర్, జాతర్ల చంద్రయ్య, గద్దల దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేయాలని
## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : కలెక్టర్ .(జనం రిపోర్టర్) : వికారాబాద్ జిల్లా కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండిభూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇల్లు, నీట్ పరీక్ష నిర్వహణపైరెవెన్యూ, గృహ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణ లు రెవెన్యూ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారత్ చట్టాన్ని పకడ్బందీగానిర్వహించాలని, అత్యంత పేద వారికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరికై తీసుకోవాల్సిన ప్రమాణికలపై అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈనెల 4న నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగేలా కావలసిన ఏర్పాటు చేసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్



ప్రతీక్ జైన్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకు గాను పైలెట్ ప్రాజెక్టు కింద భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహించి అర్జీలను స్వీకరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. వారసత్వ, సాదా బైనమాల, ఆర్ఎస్ఆర్ అసైన్మెంట్, ప్రభుత్వ భూముల గుర్తింపు తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు.అత్యంత నిరుపేదవారికి మొదటి ప్రాధాన్యతగా ఇండ్ల మంజూరుకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా వచ్చిన జాబితాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు, త్రాగునీరు, మెడికల్ క్యాంపులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డిఓ వాసు చంద్ర, డీఆర్డిఓ శ్రీనివాస్, సిపిఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇఇ కృష్ణయ్య, నీట్ సిటి కోఆర్డినేటర్ కే.సాయిలత, తహసీల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తుది
## జాబితా 2 రోజులలో తయారు చేయాలి....
## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:మే 02. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తుది జాబితా 2 రోజులలో తయారు చేయాలని, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ధృవీకరణ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మొదటి విడతల్లో పాలకుర్తి మండలానికి 594 , అంతర్గాం మండలానికి 512 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇందిరమ్మ కమిటీల నుంచి సేకరించిన ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. రాబోయే రెండు రోజులలో ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వం విడుదల



చేసిన మార్గదర్శకాలు ప్రకారం అర్హులో కాదో తేల్చాలని, అనర్హులు ఎవరైనా ఉంటే జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని,2 రోజులలో తుది లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని అన్నారు. మండలాల్లో తుది లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తే జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదం తీసుకొని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని త్వరగా గ్రౌండ్ చేసుకుంటే వర్షాకాలం లోపు నిర్మాణ పనులు ప్రారంభించ వచ్చని అన్నారు.ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్, తాహసిల్దార్ జ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి తరలి వెళ్ళిన నాయకులు.



మొగల్తూరు, మే 02 జనం రిపోర్టర్: రాజదాని అమరావతి పున: నిర్మాణ శంకుస్థాపన, ప్రారంబోత్సవ కార్యక్రమాలకు నరసాపురం నియోజవర్గం నుండి ప్రత్యేక బస్సుల్లో శుక్రవారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు తరలివెళ్ళారు. ముత్యాలపల్లి బండి మత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 20 బస్సులు,కార్ల లలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, జెండా ఊపి ప్రారంబించారు. పలు గ్రామాలకు చెందిన పార్టీల శ్రేణులు ప్రత్యేక కార్లు, బైక్లపై విజయవాడకు వెళ్ళారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కొల్లాటి. గోపి, బొల్లా చంటి, పాలా రాంబాబు, జిల్లా రత్నంరాజు, కత్తిమండ ముత్యాలరావు, జోగి పండు, బీజేపీ నాయకులు దాసరి బాబి, ఇంటి ఏడుకొండలు, జనసేన నాయకులు నిప్పులేటి తారక రామారావు, లక్కు బాబి, కొప్పాడి నాగరాజు, వాటాల దుర్గరాజు, దూసనపూడి సత్యనారాయణ తదితరులున్నారు.

## ఉన్నత విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి...జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి...




రామడుగు, (జనం రిపోర్టర్) :గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థిని విద్యార్థులు ఉన్నత విద్యను అధిరోహించడానికి కృషి ఫలితాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రమీల సత్పతి అన్నారు.ఈ సందర్భంగా రామడుగు మండలం వ్యతిరే అల్ఫోర్స్ లో రెండవ దశ ఒలంపియాడ్ ఫౌండేషన్ పరీక్ష విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందిపుచ్చుకోవడం జరిగింది. కరీంనగర్ జిల్లా విద్యాశాఖ ఆల్ఫోర్స్ విద్యాసంస్థల సంయుక్తంగా నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలకు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు 80 మంది ఎంపిక కావడం జరిగింది. వారి నిర్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించే అందుకే విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఇలాంటి అవకాశాలను విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ను ఇలా ప్రోత్సాహం కల్పించడం దానితోపాటు వారికి వసతులు కల్పిస్తూ ముందుకు పంపిస్తున్న ఆల్ఫా విద్య సంస్థల చైర్మన్ నరేందర్ కు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమం ఐదు సంవత్సరాల వరకు ఇలా కొనసాగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ ఊట్కూరు నరేందర్ రెడ్డి. రామడుగు తాసిల్దారు రాజేశ్వరి. తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య కాలనీకి చెందిన కోగిసిర్ సునని మామిడికాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు పడి మృతి....



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:మే 02. ఎన్టిపిసి పీకే రామయ్య కాలనీకి చెందిన కోగిసిర్ సునని తండ్రి పేరు నార్ని సునానీ, 42 సంవత్సరాలు అనే వ్యక్తి తన భార్య ఏర్పులా సునాని తో కలిసి పిటిఎస్ ఎన్టిపిసి లోని శ్రీ చైతన్య స్కూల్ వద్ద కాంపౌండ్ వాల్ వద్ద మేస్త్రి పని చేస్తూ, భోజన విరామ సమయంలో క్వార్టర్స్ దగ్గరలో ఉన్న మామిడి చెట్టు ఎక్కి మామిడికాయలు తెంపుతుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి తలకి, ఎడమ చెవికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని పిటిఎస్ లోని ధన్వంతరి హాస్పిటల్ కి తీసుకువెళ్లగా అక్కడ డాక్టర్లు పరిశీలించి చనిపోయినాడు అని చెప్పినారు. మృతుడికి భార్య ఒక కొడుకు ఒక కూతురు కలరు.మృతుడి కొడుకు రాహుల్ సునానికి ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ ఎస్సై ఎం. మానస కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

## నవాబుపేట్ మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో 11:30 నిమిషాలకుభూభారతి చట్టం పైన రైతులకు అవగాహన సదస్సు ముఖ్య అతిథులుగా హాజరవుతున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : నవాబుపేట్ మే 2 (జనం రిపోర్టర్)నవాబు పేట్ మండల కేంద్రంలోని శనివారం ఉదయం 11:30 నిమిషాలకు రైతు వేదిక కార్యాలయంలో భూభారతీ చట్టం పైన రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు అందరూ హాజరుకావాలని నవాబుపేట్ మండల తాసిల్దార్ జయరాం అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు హాజరవుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ హాజరుతున్నారని మండల తాసిల్దార్ జయరాం తెలిపారు.

## : సంకల్ప్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం మానవత్వానికి అంకితంగా ఓ మంచి ఉదాహరణ



(జనం రిపోర్టర్) :హైదరాబాద్‌కు చెందిన సంకల్ప్ రెడ్డి గారు (శ్రీ సంపత్ రెడ్డి గారు) తన పుట్టినరోజును ఎంతో విశిష్టంగా, మానవతా స్ఫూర్తితో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులు కలిసి, పుణ్య కార్యంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ మహత్తర కార్యక్రమం హెూప్స్ ఫౌండేషన్ మరియు దివ్యాంక్ దక్షక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ రెండు సేవా సంస్థలు కలిసి పొదిలి పరిసర గ్రామాల్లో తిరుగుతూ అనేక నిరుపేదలు, వృద్ధులు, యాచకులు వంటి సహాయ అవసరమైన వారికి ఆహారం అందజేశారు.ఈ అన్నదాన కార్యక్రమం కేవలం శారీరక ఆకలిని తీర్చడమే కాకుండా, మానవత్వం ఇంకా బతికే ఉంది అన్న నమ్మకాన్ని సమాజానికి తెలియజేసింది. సంకల్ప్ రెడ్డి పుట్టినరోజును ఇలా సేవా మార్గంలో నిర్వహించడం సమాజానికి ఒక మంచి సందేశంగా నిలిచింది.ఈ సేవా కార్యక్రమానికి తన కుటుంబం, ఫౌండేషన్ సభ్యులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ ప్రయాణం మరింత మంది జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుందాం.

## వికారాబాద్ జిల్లా లో పలు గ్రామాలలో

### వడదెబ్బ నివారణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వికారాబాద్కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి: (జనం రిపోర్టర్) : వికారాబాద్ జిల్లాలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటన లో తెలిపారు.శుక్రవారం: మండుటెండల వల్ల జిల్లాలో ఎక్కడ కూడా ప్రాణ నష్టం వంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజల్లో అవగాహనను పెంపొందించాలని అన్నారు. వైద్యారోగ్య శాఖతో పాటు, ఇతర శాఖల జిల్లా అధికారులు వడదెబ్బ నివారణపై వారివారి శాఖల ప్రణాళికకు అనుగుణంగా వేసవి తీవ్రత సమయంలో చేయవలసినవి, చేయకూడనివి వాటి గురించి క్షేత్రస్థాయిలో ప్రతి నివాస ప్రాంతంలో ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని, తప్పనిసరిగా ప్రజలు జాగ్రత్తలు పాటించేలా విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు.వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ, తీవ్రమైన వేడిమితో కూడిన ఎండలు ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వచ్చినా తలకు టోపీ ధరించడం, తువ్వాలు చుట్టుకోవడం, చేనేత వస్త్రాలు ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ వేడిమి సమయాలలో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు పెట్టుకోకూడదని, చల్లదనాన్ని అందించే నీడ ప్రదేశాలలో ఉండాలని అన్నారు. సాధారణ సమయాలకంటే వేసవిలో ఎక్కువ మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవాలని, తేలికపాటి కాటన్ వస్త్రాలను ధరించడం వంటివి చేయాలని, త్వరగా వడదెబ్బకు లోనయ్యే స్వభావం కలిగిన వారు విధిగా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయా కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాలలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేసవి తీవ్రత వల్ల వడదెబ్బకు లోను కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఉపాధి హామీ కార్మికులు ఉదయం వేళలోనే పనులు చేసేలా, పని ప్రదేశాలలో తప్పనిసరిగా నీడనిచ్చేలా షామియానాలు, తాగునీటి వసతి అందుబాటులో ఉండే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీ.హెచ్.సీలలో వైద్యాధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటూ, వడదెబ్బ నివారణ ఔషధాలు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎవరైనా వడదెబ్బకు గురైతే, వెంటనే వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తే, తక్షణ చికిత్స చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

## పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్. ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు

### హసన్ పర్తి మండలం (జనం రిపోర్టర్) :పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధానలక్ష్యం



పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు పంపిణీ చేస్తున్నామన్న ఎమ్మెల్యే నాగరాజుసీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఈరోజు హనుమకొండ సుబేదారి లోని ఎమ్మెల్యే నివాస క్యాంపు కార్యాలయం నందు హసన్ పర్తి మండల మరియు 1, 2, 55, 56, 65, 66 డివిజన్ల కు సంబంధించిన కళ్యాణ లక్ష్మీ, షాధీ ముబారక్ 37 మంది లబ్ధిదారులకు 37లక్షల 3వేల 712 రూపాయల విలువ గల చెక్కులను మరియు 55వ డివిజన్ కు సంబంధించిన 6 మంది లబ్ధిదారులకు రూ. 1లక్ష 74వేల 500 రూపాయల విలువ గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు లబ్ధిదారులకు అందజేశారుఅనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూకాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారురాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా



నూతన వధూ వరులకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించబడిందని అన్నారు పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఉన్నదని కేఆర్ నాగరాజు అన్నారువైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారుపార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన సీఎం సహాయ నిది చెక్కులను సైతం తీసుకు వచ్చి పంపిణి చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్ కార్యాలయం కు వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారుకాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారువైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారుపార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గత ప్రభుత్వ హయాంలో మిగిలిపోయిన సీఎం సహాయ నిది చెక్కులను సైతం తీసుకు వచ్చి పంపిణి చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్ కార్యాలయం కు వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళు న్నామని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో హసన్పర్తి మండల మరియు 1, 2, 55, 56, 65, 66 డివిజన్ల ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్, గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జీవితంపై విరక్తి చెంది మహిళ మృతి



గుడిబండ (జనం రిపోర్టర్) :మండలం ఎస్ ఆర్ హట్టి గ్రామానికి చెందిన ఎం రోజా (28)సం మహేశ్ అను ఆమె పిల్లలు ఆపరేషన్ చేసుకున్నా తరువాత నుండి కొద్ది ఆమె కు కొన్ని సంవత్సరాలు నుండి కడుపునొప్పితో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చాలా చూపించిన కూడ కడుపునొప్పి నయము కాకపోవడంతో జీవితం పై విరక్తి చెంది గురువారం రాత్రి ఐరన్ ఉక్కు కు తన చూన్నితో ఉరివేసుకొని అక్కడే మృతి చెందింది శుక్రవారం తెల్లవారుజామున తన సొంత ఇంట్లో లోపలి రూములో ఆమె భర్త గొర్రెల కాపిరి వీరికి ఒక కూతురు ఒక కుమారుడు ఉన్నారు అని ఆమె తల్లి అయిన పుట్టారంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుడిబండ ఎ ఎస్ ఐ రమణ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్ డి టి ని రక్షించుకుందాం



నార్పల :(జనం రిపోర్టర్) :ఆర్డిటి సంస్థను కాపాడాలంటూ శాంతియుత ర్యాలీని మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నుండి గాంధీ సర్కిల్ వరకు నిరసన ర్యాలీని శనివారం మండల ప్రజలు చేపట్టారు. అనంతపురం జిల్లా లోని ఆర్డిటి సంస్థ 1969లో వచ్చినప్పటి నుండి పేద ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిందని, అందులో ప్రధానంగా పేదలకు విద్య, ఆరోగ్యము, పక్కా గృహాలు ఇవ్వడం, వికలాంగుల అభివృద్ధికి తోడ్పడటం, మహిళలను అన్ని రంగాలలోనూ అభివృద్ధి పథంలో నడిపించడానికి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆధ్వర్యంలో ఆర్ డి టి సంస్థ ఎంతో కృషి చేసిందని ర్యాలీకి హాజరైన వక్తలు తెలిపారు. ఇలాంటి సంస్థకు ఈరోజు చాలా కష్ట కాలము రావడం చాలా దురదృష్టకరమని, కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఎ సంబంధించి ఆర్ డి టి సంస్థకు నిలిపివేయడం వల్ల ఆర్డిటి చేయు అభివృద్ధి కార్యక్రమాలకి ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఇలా కేంద్రం తీసుకున్న హేయమైన చర్య వల్ల పేద ప్రజలకు ఎంతో అన్యాయం చేకూరుతుందని, పేద ప్రజలు జీవితాలకి చాలా ఇబ్బంది వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఎంతోమంది పేదవాళ్ళకి ఉపయోగపడే ఆర్డిటి సంస్థను కొనసాగించాలని, సమస్త కార్యక్రమాలను కొనసాగించే విధంగా చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, మండల అధికారులు, మండల ప్రజలందరూ ముక్తకంఠంతో ఆర్డిటి సంస్థకి సంఘీభావ శాంతియుత ర్యాలీగా చేపట్టామని తెలిపారు. సత్వరమే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు ఆర్ డి టి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఐ సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేసి జిల్లాలో ఉన్న పేదలకు ఆర్డిటి సేవలను మరింత చేరువుగా చేయాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు.

## సిడ్నీ ఆస్ట్రేలియాలో వైఎస్సార్సీపీ గ్లోబల్ కనెక్ట్ పర్యటన ఘన ఆరంభం



(జనం రిపోర్టర్) :ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో తొలి సమావేశం విజయవంతంవైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ విభాగ గ్లోబల్ కోఆర్డినేటర్ మరియు అనంతపురం జిల్లా వాసి అయిన శ్రీ ఆలూరు సాంబశివారెడ్డి చేపట్టిన గ్లోబల్ కనెక్ట్ పర్యటనకు సిడ్నీలో శుభారంభం జరిగింది.మే 2, 2025న సిడ్నీ నగరంలో నిర్వహించిన తొలి సమావేశం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులను కలిపి, ప్రజల ప్రభుత్వాన్ని మళ్లీ తీసుకురావాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సమావేశంలో శ్రీ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ "జగనన్న నాయకుడు కాదు, ఒక . ప్రజల గుండె ధ్వనిని అర్థం చేసుకునే మార్గదర్శి.ఆయన 3,648 కిలోమీటర్లు ఓటు కోసం కాదు ు ప్రతి గుండెను వినటానికే నడిచారు.ప్రతి హామీని ఒక నైతిక ఒప్పందంగా భావించి, 99% అమలు చేసిన ఘనత జగనన్నగారి."మేనిఫెస్టో నా బైబిల్, నా భగవ్గీత, నా ఖురాన్" అని చెప్పే నాయకుడు ఆయన.ఆయన




పాలనలో స్కాం లేదు సేవ ఉంది. గెలుపు కోసం కాదు ప్రజల గౌరవం కోసం పాలన.ప్రజల ఇంటి వద్దకే పాలనను చేరుస్తూ, ప్రతి వర్గానికీ, ప్రతి ఇంటికీ అండగా నిలిచారు. దేశంలో ఇలా నైతికత, నిబద్ధతతో ఉన్న నాయకుడు మరొకరు లేరనిలిలి ఆయన స్పష్టం చేశారు.వైఎస్సార్సీపీ పాలనలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు 1. పాలనా విప్లవం సచివాలయాలు, వాలంటీర్లు, స్పందన, సామాజిక ఆడిట్లు 2. ఆరోగ్య విప్లవం %-% మెడికల్ కాలేజీలు, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ విస్తరణ 3. విద్యా విప్లవం నాడు-నేడు, డిజిటల్ తరగతులు, విద్యా దీవెన, ట్యాబ్లెట్లు 4. సంక్షేమ విప్లవం - 4.47 లక్షల కోట్లు డీబీటీ, అమ్మఒడి, చేయూత, రైతు భరోసా 5. ఆర్థిక పారిశ్రామిక అభివృద్ధి ?13 లక్షల కోట్ల పెట్టుబడులు, మెగా ప్రాజెక్టులు 6. మౌలిక సదుపాయాల అభివృద్ధి %-% పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రహదారులు, ఇండస్ట్రియల్ పార్కులుసామాజిక మాధ్యమాల్లో ప్రవాసాంధ్రుల బాధ్యత"ప్రతి పోస్ట్, ప్రతి షేర్ ఓటుతో సమానం."నిజాన్ని గణాంకాలతో ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రవాసాంధ్రులదేనని సాంబశివారెడ్డి గారు స్పష్టం చేశారు.భావోద్వేగ సందేశం %-% మీరే మార్పు"మీరు రాజకీయ నాయకులు కాకపోయినా మీరు చేసే ఒక్క పోస్ట్, కలిపే ఒక్క మిత్రుడు రాష్ట్ర భవిష్యత్తును మార్చగలడు."ఈ పర్యటన ు బాధ్యతను గుర్తు చేయడమే కాదు%"% భవిష్యత్తు కోసం పోరాటానికి స్ఫూర్తి.ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా వైఎస్ఆర్సీపీ కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, సిడ్నీ కన్వీనర్ అమర్ మరియు స్థానిక వైఎస్సార్సీపీ మద్దతుదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## చెన్నకేశవ అనాధాశ్రమం వారికి నార్పల గ్రామస్తులైన పునామిన ఫర్నిచర్ షాప్ ఓనర్



నార్పల(జనం రిపోర్టర్) :గారైన శ్రీ ఇండ్ల రాము శ్రీమతి ఇండ్ల నాగేశ్వరి వారి కుమారుడు చి" గిరీష్ 25 కేజీల చక్కెర స్పాన్సర్ చేశారు వీరు వీరి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా చెన్నకేశవ అనాధాశ్రమం నుంచి మేమందరం దేవున్ని ప్రార్థిస్తున్నాం

## జిల్లా కలెక్టర్ చేత అవార్డు అందుకున్న తహసిల్దార్ కృష్ణయ్య..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి పై ప్రజలకు మంచిగా అవగాహన కలిగినందుకు దేవరకద్ర తాసిల్దార్ కృష్ణయ్య జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి చేత ఘనంగా శాలువాతో సన్మానం చేయించుకొని అవార్డు అందుకున్నారు. కలెక్టర్ చేత అవార్డు అందుకున్న కృష్ణయ్యకు పలువురు అధికారులు నాయకులు మీడియా మిత్రులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి అవార్డులు మునుముందు మరెన్నో అందుకోవాలని నాయకులు కోరారు. కృతజ్ఞతలు తెలిపిన వారిలో నూతన మండల జర్నలిస్టుల సంఘం గౌరవ అధ్యక్షులు రమేష్ చారి, ప్రాణేష్ చారి, అధ్యక్షులు ఎండి షఫీ, ఉపాధ్యక్షులు ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్ ఐ శరత్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..

:నియోజకవర్గ పరిధిలో భూత్పూర్ మండల పరిధిలోని కప్పేట గ్రామంలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్టాపన పూజా కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు.అర్చకులు ప్రత్యేకంగా హెూమాలు నిర్వహించి బొడ్రాయి పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఒక పండుగ వాతావరణం తలపించింది. ఈ పూజా కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ప్రజలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రతినిధి శ్రీకాంత్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డిసిపి కరుణాకర్ తో కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పట్టిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు భద్రత ప్రమాణాల పై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పెద్దపల్లి జిల్లా లో అధికంగా ట్రాఫిక్ ఉండే జంక్షన్ల వద్ద అవసరమైన

## అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సీరియస్..



**హైదరాబాద్, :** ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. ప్రజల ప్రయాణ సౌలభ్యం కోసం ప్రాధాన్యతతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉప్పల్-ఘట్ కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూమి సేకరణలో ఆలస్యం పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీరియస్ అయ్యారు. లక్షలాది ప్రయాణికుల రాకపోకలకు ఉపయోగపడే ఉప్పల్ నుంచి ఘట్ కేసర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ కోసం భూమి సేకరణ ప్రక్రియలో జాప్యం అవుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టు వేగవంతంగా పూర్తయ్యేలా వెంటనే భూమి సేకరణ పూర్తిచేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ. 400 కోట్ల వ్యయంతో నిర్మితమైన అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను మే 5న కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ కింద రోడ్డుపై ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు. కాగా.. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ అని.. అభివృద్ధి అంటే కేవలం హైటెక్ సిటీ కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఓల్డ్ సిటీ, గౌలిగూడ, అంబర్ పేట్, సనత్ నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని తెలిపారు. నిధుల కొరత లేకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ వంటి సమస్యలు బస్తీల్లో రొటీన్ అయ్యాయన్నారు. నగరంలో అవసరమైన ప్రతిచోట స్ట్రీట్ లైట్స్, రీస్టోరేషన్ తక్షణ చర్యలు అవసరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైటెక్ సిటీతో పాటు ఓల్డ్ సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మెట్రో రైలు ప్రాజెక్టులో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన ఫస్ట్ ఫేజ్‌ను విస్తరించాలన్నారు. సెకండ్, థర్డ్, ఫోర్త్ ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం పంపించాలన్నారు.

## కుల గణనపై తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదు..




**హైదరాబాద్, :** కుల గణనపై తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో జరిగిన చర్చలో బీజేపీ, సీపీఐ, బీఆర్ఎస్ కూడా పాల్గొన్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయికి సర్వే వెళ్ళిందని.. కిషన్ రెడ్డికి ఈ విషయం తెలుసుకోవాలన్నారు. ఇంటి ఇంటికి అధికారులు వెళ్లి సర్వే చేశారన్నారు. కుల గణనపై కిషన్ రెడ్డి చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. రేవంత్ సక్సెస్ అయ్యాడు కాబట్టి డైవర్ట్ చేసి బురద జల్లే ప్రయత్నం చేయకండన్నారు. 100 శాతం సర్వే సక్సెస్ ఫుల్ గా జరిగిందని.. గవర్నర్ కూడా ఆమోదముద్ర వేశారన్నారు. అంటే సర్వే సరిగా జరిగింది అనే కదా..? అని అడిగారు. సర్వే జరిగిన నెల రోజుకు కిషన్ రెడ్డి తెలంగాణలో లేర అనుకుంటా అన్నారు. అందుకే ఆయనకు కుల గణన మీద పూర్తిస్థాయిలో అవగాహన లేదని జగ్గారెడ్డి అన్నారు. అసెంబ్లీలో మీ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని.. వాళ్ళు కూడా మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేల మీద కూడా అనుమానం ఉందా..? అని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొనని వాళ్ళ కోసం మళ్ళీ సమయం పొడిగించారు కదా..? అన్నారు. కిషన్ రెడ్డి మాటలు నమ్మకండని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కిషన్ రెడ్డికి సెంట్రల్ పార్టీ మొట్టికాయలు వేసిందని.. అందుకే ఈ మధ్య స్టేట్మెంట్లు ఇస్తున్నారన్నారు. కేంద్రం నిర్ణయం తీసుకునే సమయంలో ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. రాజకీయ విమర్శలు మానుకోండన్నారు.

## 9 ప్రాజెక్ట్‌లను ప్రకటించిన లైకా సంస్థ



**న్యూఢిల్లీ,:** ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగిన వేవ్స్ (వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్) సమ్మిట్, భారతదేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో వినోద రంగంలో కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో నిర్వహించబడింది. మే 1వ తేదీన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై, భారతీయ చిత్ర పరిశ్రమ యొక్క ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు. ఈ సందర్భంగా లైకా ప్రొడక్షన్స్, మహవీర్ జైన్ ఫిల్మ్స్‌తో కలిసి 9 కొత్త సినిమా ప్రాజెక్టులను నిర్మించనున్నట్లు ఒక సంచలన ప్రకటన చేసింది. ప్రధానమంత్రి మోదీ యొక్క దూరదృష్టి మరియు లక్ష్యాలకు అనుగుణంగా, భారతదేశాన్ని గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా రూపొందించేందుకు ఈ 9 ప్రాజెక్టులను రూపొందిస్తున్నట్లు లైకా సంస్థ వెల్లడించింది. ఈ ప్రాజెక్టులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు కథలను ప్రపంచ వేదికపై ఆవిష్కరించే లక్ష్యంతో మహవీర్ జైన్ ఫిల్మ్స్‌తో సహకారంతో నిర్మించబడనున్నాయి. ఈ సందర్భంగా లైకా గ్రూప్ చైర్మన్ డా. అల్లిరాజా సుభాస్కరణ్ మాట్లాడుతూ, "భారతీయ మూలాలతో ప్రపంచ స్థాయి సంస్థగా, లైకా గ్రూప్ భారతీయ సినిమాను ప్రపంచ ప్రేక్షకులకు చేరువ చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. మన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, ఆకర్షణీయ కథలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు మహవీర్ జైన్ ఫిల్మ్స్‌తో భాగస్వామ్యం కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర సమాచార మరియు ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, హోం వ్యవహారాల సహాయ మంత్రి డా. ఎల్. మురుగన్‌తో పాటు లైకా చైర్మన్ డా. సుభాస్కరణ్, మహవీర్ జైన్ వంటి ప్రముఖులు పాల్గొని, భారతీయ సినిమా యొక్క భవిష్యత్తుపై చర్చించారు.

## పాకిస్తాన్‌కి విదేశీ విమాన సంస్థల షాక్..
## ప్రతీ నెలా మిలియన్ డాలర్ల నష్టం..




**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. లష్కరే తోయిబా ఉగ్రవాదులు చేసిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో భారత్ ఎప్పుడు దాడి చేస్తుందో అనే భయంతో పాకిస్తాన్ తన గగనతలాన్ని భారత వైమానిక సంస్థలకు మూసేసింది. పాక్ చర్యకు ప్రతీకారంగా భారత్ కూడా తన ఎయిర్‌స్పేస్‌ని పాకిస్తాన్‌కి చెందిన విమానాలకు మూసేసింది. ఈ నిర్ణయం వల్ల భారతదేశానికి చెందిన విమానయాన సంస్థలకు చెందిన అనేక విమానాలు పాకిస్తాన్ మీదుగా ప్రయాణించలేదు. దీని వల్ల ఉత్తర భారతదేశం నుంచి మిడిల్ ఈస్ట్, పశ్చిమాసియా, యూరప్, అమెరికాకు వెళ్లే విమానాలు గుజరాత్, ముంబై మీదుగా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. దీని వల్ల ప్రయాణికులపై అదనపు సమయం, అదనపు ఖర్చు పడుతుంది. విమానయాన సంస్థలకు నష్టాలు వస్తాయి. ఇదిలా ఉంటే, ఉద్రిక్తతల నడుమ విదేశాలకు చెందిన విమానయాన సంస్థలు కూడా పాకిస్తాన్ గగనతలాన్ని స్వచ్ఛందంగా వినియోగించుకోవడం లేదు. బదులుగా పాకిస్తాన్‌ని తప్పించుకుని భారత్‌కి వస్తున్నాయి. భారత విమానయాన సంస్థలే కాకుండా, ఇప్పుడు విదేశాలకు చెందిన విమాన కంపెనీలు కూడా ఇప్పుడు పాకిస్తాన్‌కి షాక్ ఇచ్చాయి. అసలే ఆర్థికంగా దివాళా తీసిన దాయాది, ఇప్పుడు విమానయాన సంస్థలు చెల్లించే ఓవర్ ఫ్లైట్ ఫీజులను కోల్పోతోంది. దీని వల్ల ప్రతీ నెలా మిలియన్ డాలర్లను పాక్ కోల్పోతుంది. గత రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో లుఫ్తాన్సా, బ్రిటిష్ ఎయిర్ వేస్, స్విస్, ఎయిర్ ఫ్రాన్స్, ఇటలీకి చెందిన ఐటీఏ, పోలాండ్‌కి చెందిన ఎల్‌ఓటి వంటి ప్రముఖ యూరోపియన్ విమానయాన సంస్థలు పాకిస్తాన్ మీదుగా ప్రయాణించలేదు. ఈ దెబ్బతో పాకిస్తాన్ పౌర విమానయాన సంస్థ వార్షిక ప్రాతిపదికన ఓవర్ ఫ్లైట్ ఛార్జీల కారణంగా వందల మిలియన్లు నష్టపోవచ్చు.ఫిబ్రవరి 2019లో, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని బాలకోట్‌లోని ఉగ్రవాద శిబిరంపై భారతదేశం వైమానిక దాడి చేసిన తర్వాత, విమానయాన సంస్థలకు గగనతల నిషేధం కారణంగా పాకిస్తాన్ అధికారం ఐదు నెలల కాలంలో కనీసం 100 మిలియన్

# చివరకు కులగణన వైపే మొగ్గు



కులగణన ప్రతిపాదనపై గత కొన్నేళ్లుగా కారాలూ మిరియాలూ నూరుతూ వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎట్టకేలకు తన వైఖరి మార్చుకుంది. వచ్చే జనగణనతోపాటే కులగణన కూడా చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ బుధవారం నిర్ణయించటం దేశ చరిత్రలో ఒక కీలకమైన మలుపు. అయితే ఇప్పటికే అయిదేళ్లుగా వాయిదా పడుతూవస్తున్న జనగణన ఎప్పుడు ప్రారంభిస్తారన్న అంశంలో స్పష్టత లేదు. స్వాతంత్ర్యానంతరం అణగారిన కులాలు సైతం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటం వంటి పరిణామాల కారణంగా ఆ వర్గాల్లో చైతన్యం పెరిగింది. జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటం లేదన్న అసంతృప్తి ఎక్కువైంది. అందుకే కులగణన జరపాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. దేశంలో దీన్ని మొట్టమొదట స్వాగతించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 2021లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కులగణన జరపాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానంచేసి పంపింది. 2024 జనవరిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వేగవంతంగా, శాస్త్రీయంగా కులగణన నిర్వహించారు. బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు సైతం కులగణన చేశాయి. అయితే బీజేపీ మొదటినుంచీ ఈ డిమాండును వ్యతిరేకించింది. 2021 జులై 20 నాడు పార్లమెంటులో సభ్యులు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చిన ఆనాటి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ 'జనగణనలో ఎప్పటిలా ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా లెక్కల సేకరణ మినహా ఇతర కులాల లెక్కింపు జరపరాదన్నది కేంద్రప్రభుత్వ విధానపరమైన నిర్ణయం' అని ప్రకటించారు. బయట ఎక్కడా నేరుగా కులగణనను వ్యతిరేకిస్తూ బీజేపీ నేతలు ప్రకటనలు చేయకపోయినా, సమాజాన్ని విచ్ఛిన్నం చేయటానికి కాంగ్రెస్ కులాన్ని ఉపయోగించుకుంటున్నదని విమర్శించేవారు. మొన్నటికి మొన్న పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు నావికాదళ లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను మతం ఏమిటో కనుక్కుని కాల్చిచంపటాన్ని ప్రస్తావించి 'వారడిగింది మతం... కులంకాదు' అని ఛత్తీస్‌గఢ్ బీజేపీ ట్వీట్ చేసింది. అయితే కులగణన చేయటమే సరైందని ఆరెస్సెస్ భావిస్తున్నదని రెండు నెలల క్రితం ఒక ఆంగ్లపత్రిక వెల్లడించినప్పటినుంచీ దీనిపై కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవచ్చున్న అంచనాలు మొదలయ్యాయి. జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా జరిగితే దేశంలో దాదాపు వందేళ్ల తర్వాత ఆ ప్రక్రియ మళ్లీ అమల్లోకొచ్చినట్టవుతుంది. ఆఖరుసారి వలస పాలకుల హయాంలో 1931లో కులాలవారీ జనాభా లెక్కేశారు. అప్పట్లో 4,147 కులాలున్నట్టు తేల్చారు. 1901లో ఈ సంఖ్య 1,646. తర్వాత 1941లో కూడా కొంతవరకూ జనాభా లెక్కల్లో కులాన్ని గణించారుగానీ రెండో ప్రపంచయుద్ధ కారణంగా మధ్యలోనే ఆగిపోయింది. స్వాతంత్ర్యానంతరం ఎస్సీ, ఎస్టీల వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. పీపుల్ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు 1992లో జరిపిన ఒక సర్వే ప్రకారం దేశంలో 4,635 కులాలున్నాయి. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణన నిర్వహిస్తామని వాగ్దానం చేశారు. అనంతరం సాంఘికార్థిక సర్వేకింద 2011-12 మధ్య ఆ లెక్కలు తీశారు. కానీ ఆ డేటాను బయటపెట్టలేదు. ఇటీవల జనగణనపై కాంగ్రెస్ పట్టుబట్టడం మొదలైంది. మతంపై ప్రధానంగా కేంద్రీకరించే బీజేపీ ఇందుకు ససేమిరా సమ్మతించబోదని, అందువల్ల ఎన్నికల్లో కులగణన తనకు ప్రధాన ఆయుధంగా మారుతుందని ఆ పార్టీ భావించింది. కానీ బీజేపీ హఠాత్తుగా మనసు మార్చుకోవటంతో కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ నినాదం లేకుండా పోయింది. అణగారిన కులాలు అడిగాయని కాదు... కులం ఒక వాస్తవం అయినప్పుడూ, సమాజంపై దాని ప్రభావం అమితంగా వున్నప్పుడూ ఎవరి సంఖ్య ఎంతో తేల్చటం ప్రభుత్వాల బాధ్యత. ఇన్నాళ్లూ దాన్ని విస్మరించారు. ఇందువల్ల రెండు రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సంక్షేమ ఫలాలు లక్షిత వర్గాలకు సరిగా చేరటం లేదు. ఇప్పటికీ విద్యాగంధం అంటని, ప్రభుత్వ పథకాల సంగతే తెలియని కులాలవారు గణనీయంగావున్నారు. ఫలితంగా బడ్జెట్‌లలో గర్వంగా ప్రకటించుకునే పథకాలు ఆచరణలో నిరుపయోగం అవుతున్నాయి. ఇక ఇంద్ర సాహ్నీ కేసులో రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీంకోర్టు నిర్ణయం కోటా పెంపు ప్రయత్నాలకు అవరోధమవుతోంది. సమస్య వుందని ప్రభుత్వాలకు తెలిసినా, కొత్తగా తెరపైకొస్తున్న కులాలకు న్యాయం చేద్దామనుకున్నా అసాధ్యమవుతున్నది. అన్ని రంగాల్లోనూ ఆధిపత్య కులాల హవా కొనసాగుతోంది. సమయానుకూల నిర్ణయాలు తీసుకోవటంలో, గాలివాలుకు అనుగుణంగా దూసుకెళ్లటంలో బీజేపీ దరిదాపుల్లోకొచ్చే రాజకీయపక్షం మరొకటి లేదు. వాస్తవానికి గత లోక్‌సభ ఎన్నికల ముందూ... మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భాల్లో కులగణనపై కేంద్రం నిర్ణయం ప్రకటిస్తుందని అందరూ భావించారు. అలాచేస్తే కాంగ్రెస్ డిమాండుకు తలొగ్గినట్టయ్యేది. పహల్‌గామ్ మారణకాండపై దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు మిన్నంటుతున్నవేళ కులగణన నిర్ణయం తీసుకోవటంతో అది తన ఘనతేనని కాంగ్రెస్ చెప్పుకునే పరిస్థితి లేకుండాపోయింది. పైగా కేంద్రంలో ఎక్కువకాలం అధికారంలోవున్నా కులగణన జోలికి పోకపోవటం... 2011-12లో ఆ పని చేసినా దాన్ని సామాజికార్థిక సర్వేగా చెప్పటం ఆ పార్టీకి పెద్ద మైనస్. బిహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ తీసుకున్నా తాజా నిర్ణయం నిస్సందేహంగా బీజేపీకి ఉపకరిస్తుంది. అయితే దీని వెంబడి రాగల ఇతరేతర డిమాండ్లతో ఆ పార్టీ ఎలా వ్యవహరిస్తుందన్నది చూడాలి.

# ట్రంప్‌కు మేడే హెచ్చరిక!



రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అధికారంలో ఉండి తొలి వందరోజుల్లో హీనమైన ప్రజాదరణ కలిగిన అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ అమెరికాలో చరిత్రకెక్కాడు. అయినప్పటికీ ఎలాంటి సిగ్గూ బిడియం లేకుండా ఆత్మస్తుతి, పరనిందలతో వందవరోజు ఉప న్యాసం చేశాడు. ఇంతటి ఘనత వహించి ఈ పెద్ద మనిషి యావత్ ప్రపంచంతో పాటు కార్మిక వర్గానికి కూడా ముప్పు తేవటంతో అమెరికా చరిత్రలో అతి పెద్ద సంఖ్యలో గురువారం నాడు ఆరువందలకు పైగా జరిగిన మే డే దీక్షాదిన ప్రదర్శనల్లో లక్షలాది మంది పాల్గొని కబడ్దార్ కార్మికుల జోలికి రావద్దని హెచ్చరించటం కూడా ముఖ్యమైన పరి ణామమే. రెండవసారి అధికారానికి వచ్చి వందరోజుల్లో లోకజ్ఞాన విప్లవం తెచ్చానని, పెను మార్పులకు నాంది పలికినట్లు ట్రంప్ చెప్పుకున్నాడు. జనంలో తన పలుకుబడి తగ్గిందన్న సర్వేలను నకిలీ వంటూ ట్రంప్ అపహాస్యం చేశాడు.తనకు గట్టి మద్దతు ఇచ్చిన మిచిగాన్ రాష్ట్రంలో ఆటోమొబైల్ కేంద్రమైన డెట్రాయిట్ సమీపంలో జరిగిన సభలో మాట్లాడుతూ తన అధికారాన్ని కుదించేందుకు విప్లక కమ్యూనిస్టు, వామపక్ష భావాలు కలిగిన న్యాయమూర్తులు చూస్తు న్నారని ఏదీ తనను ఆపలేదని ఎన్నికల సభల్లో మాదిరి రంకెలు వేశాడు. గడచిన వందేండ్లలో తన మాదిరి విజ యాలు సాధించిన వారెవరూ లేరన్నాడు. ముందే చెప్పుకున్నట్లు రెండవ ప్రపంచ యుద్ధం తరువాత తొలి వందరోజుల్లో యాభైశాతం కంటే తక్కువ పలుకు బడిన కలిగిన వారు ఇద్దరే అధ్యక్షులని, ట్రంప్‌కు నలభైనాలుగు శాతం మంది మాత్రమే మద్దతు ఇచ్చినట్లు గాలప్ సర్వే పేర్కొన్నది. ఎన్‌పిఆర్ ఇతర సంస్థలతో కలసి నిర్వహించిన సర్వే ట్రంప్ ఫెయిలైనట్లు ఎఫ్ గ్రేడ్ ఇచ్చిన వారు 45శాతం మంది ఉన్నారు. ఏ,బి గ్రేడ్లు 40, సి,డి గ్రేడ్లు పదిహేనుశాతం మంది ఇచ్చారు.చిత్రం ఏమి టంటే అధికార పక్షం రిపబ్లికన్లలో ఏ గ్రేడ్ ఇచ్చినవారు 54శాతం మందే ఉండటం విశేషం.నోరు తెరిస్తే అబ ద్దాలు మాట్లాడుతున్న ట్రంప్ వంద రోజుల ప్రసంగంలో కూడా తన ఏలుబడిలో చిన్న విషయాల మీద కూడా దిగజారి మాట్లాడాడు. గుడ్ల ధరలు 87శాతం తగ్గినట్లు పచ్చి అవాస్తవాన్ని చెప్పాడు.తాను వచ్చిన తర్వాత పెట్రోలు ధరలు చాలా తగ్గాయ న్నాడు, నిజానికి స్వల్పంగా పెరిగాయి. ప్రపంచ దేశాల మీద తొలి వందరోజుల్లో ప్రారంభించిన వాణిజ్య యుద్ధాన్ని తానే తొంభై రోజుల పాటు వాయిదా వేసుకున్నట్లు ప్రకటించటం ట్రంప్ బలహీనతకు చిహ్నం. ఇరవై నాలుగు గంటల్లోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానని ప్రగల్భాలు పలికాడు. ఇప్పుడది కనుచూపు మేరలో కనిపించటం లేదు. రష్యా దాడుల్లో ఉక్రెయిన్ పౌరులు మరణించటాన్ని తప్పుపట్టిన అపరమానవతా వాది గాజాలో అదే నోటితో ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండను సమర్ధిస్తున్న దుర్మార్గం రెండు నాలుకల వైఖరి తప్ప మరొకటి కాదు.ఇలా ఎన్నో వైఫల్యాలు, స్వంత కార్మికవర్గంపైనే దాడికి పూనుకున్న కారణంగానే అతగాడి పలుకుబడి అంతగా దిగజారిందన్నది స్పష్టం. "బిలియనీర్ల స్వాధీనాన్ని అడ్డు కోవాలి.మనం అత్యధి కులం వారు అల్పసంఖ్య. ఇదే మేడే సందేశం, మాతో చేతులు కలపండి " అంటూ మేడే దీక్షా దిన ప్రదర్శనలకు పిలుపు ఇచ్చిన సంస్థలు పేర్కొన్నాయి. స్థానిక కార్మికులే కాదు, వలస వచ్చిన అన్ని తరగతులకు చెందిన వారు గురువారం నాటి ప్రదర్శనల్లో పాల్గొన్నారు. వలస వచ్చిన వారికి రక్షణ ఈ ఏడాది మే డే పిలుపులోప్రధాన అంశంగా ఉంది. వేతనాలు, ఉపాధి, పౌరహక్కులు, అన్ని రకాల స్వేచ్ఛలను ట్రంప్ సర్కార్ హరిస్తున్నదని వక్తలు పేర్కొన్నారు. కుబేరుడైన ఎలన్‌మస్క్, అతగాడి కులీన మద్దతుదారులు మన సామాజిక తరగతుల్లో సంక్షోభానికి కారకులౌతున్నారంటూ జనాన్ని హెచ్చరించారు. వేతనాలను దిగ్గోసేందుకు, ఇప్పటివరకు అనుభవిస్తున్న సౌకర్యాలను కుదిం చేందుకు, మొత్తం ఆత్మగౌరవాన్నే దెబ్బతీసేందుకు చూస్తున్నారని, వలస కార్మికులను పోటీపెట్టి కార్మిక సంఘాల ఐక్యతను దెబ్బతీసే కుట్ర జరుగు తోందని వక్తలు పేర్కొన్నారు. ఈ మేడే చరిత్రలో మరో కొత్త అధ్యాయమని, నూతన యుగానికి నాంది, కార్మికులు దయా దాక్షిణ్యాలు కోరటం లేదు, న్యాయంగా రావాల్సిందాన్ని కోరుతున్నా మని స్పష్టం చేశారు.డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్యయుద్ధానికి ప్రపంచ దేశాల్లో ఎలా ప్రతి ఘటన ఎదురవుతున్నదో, ప్రాజెక్టు 2025 పేరుతో కార్మికవర్గం మీద ప్రారంభించిన దాడికి కూడా అంతకంటే ఎక్కువ వ్యతిరేకత పెరగటం అనివార్యం.

# హక్కులు దూరం.. భద్రత మహాఘోరం



చికాగో కార్మికులు 1886లో చేసిన వీరోచిత పోరాటంలో ఆరుగురు కార్మికుల అమరత్వం దోపి డి వర్గం దాష్టికానికి మరో ఏడుగురు ఉరితాడుకు ప్రా ణత్యాగం చేసిన ఫలితంగా 8 గంటల పనిదినం లభించింది.మెరుగైన పరిస్థితులు, కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు సాధించబడి ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గం మే1 న ప్రపంచ కార్మిక పోరాట దినోత్సవం జరుపుకొంటున్నది. కార్మికవర్గ భవిష్యత్తు కోసం జీవితాన్ని త్యాగం చేసిన కార్మిక వీరులు మరణించి నేటికి 139 సంవత్సరాలు అవుతుంది.ప్రపంచ వ్యాప్తంగా శ్రామికులు,కార్మికులు 139వ మేడే జరుపుకుంటున్నారు. చికాగో అమరుల త్యాగాలను స్మరించుకుంటున్నారు. చికాగో నగరంలో ఏ బానిసత్వానికి వ్యతిరేకంగా ఏ 18 గంటలపని దినానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేశారో దేశంలో నేటికీ అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలో దేశాలు నెలకొన్న ప్రస్తుత పరిస్థితులలో చికాగో కార్మికుల పోరాటాన్ని త్యాగాన్ని పూర్తిగా తీసుకొని మరో పోరాటానికి కార్మికులు సిద్ధం కావలసిన అవసరం నెలకొంది దేశంలో కార్మిక వర్గానికి దుర్భర దారిద్ర పరిస్థితులు ఎదుర్కొంటున్నది ప్రత్యేకంగా బిజెపి ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో నరేంద్ర మోడీ ప్రధానిగా అధికారం చేపట్టిన తర్వాత కార్మికుల పరిస్థితి పెనం నుండి పొయ్యిలో పడిన చందంగా మారింది 12 గంటల పని దినం కనీస వేతనాలు చెల్లించకుండా ఉండే అధికారం యాజమాన్యాల కివ్వడం,యూనియన్లు పెట్టుకునే హక్కును కాలరాచివేయడం,కార్మిక హక్కుల సాధనకోసం వేతనాల పెంపుదల వేధింపులకువ్యతిరేకంగా ఆందోళనలు,సమ్మెల లాంటివి చేసేందుకు అవకాశాలు లేకుండా చేయడం ఒక్క మాటలో కార్మిక వర్గాన్ని యాజమాన్యాలు కార్పొరేట్ సంస్థల కాళ్లదగ్గర కట్టు బానిసలుగా చేసేందుకు 2020లో నాలుగు లేబర్ కోడులను తీసుకురావడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న ఉమ్మడి జాబితాలో ఉన్న కార్మిక విషయాలను కేంద్ర ప్రభుత్వమే చేతుల్లోకి తీసుకొని నిరంకుశంగా నాలుగు లేబర్ కోడెలను ప్రతిపక్ష పార్టీలులేనిసందర్భంలోపార్లమెంటు లో పెట్టి ఆమోదించడం జరిగింది. భారతదేశ కార్మిక వర్గానికి నాలుగు లేబర్ కోడ్ లు ఉరితాడుగా మారాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే 12 గంటల పని దినాన్ని అమలు చేస్తూ పని స్థలాల్లో కనీస రక్షణ చర్యలు లేకుండా కార్మిక శాఖ అధికారులకు హక్కులు అధికారాలను నామమాత్రం చేసి యాజమాన్యాలు కార్పొరేట్ సంస్థలకు సంపూర్ణమైన స్వేచ్ఛ స్వతంత్రాలను కట్టబెడుతున్నారు బిజెపియేతర కొన్ని రాష్ట్రాలు నాలుగు లేబర్ కోడెలను అమలు చేసేది లేదని ప్రకటించి ఉన్నాయి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానించి అమలు చేయబోమని ప్రకటించాల్సిన అవసరం ఉంది. అత్యంత ప్రమాదకరమైన కార్మికులకు మనుగడ లేకుండా చేసే నాలుగు లేబరు కోడులకు వ్యతిరేకంగా కార్మికుల ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ప్రజల సొమ్ముతో స్థాపించబడిన ప్రభుత్వ రంగ పరిశ్రమలను బిజెపి ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాలు అంబానీ అధానే వేదాంతలాంటి కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మివేస్తున్నారు. బొగ్గురంగంలో లాభాలతో నడుస్తున్న సింగరేణి లాంటి సంస్థలలో బొగ్గుబావులను అంబానీ, ఆదానీలకు అమ్మకానికి పెట్టడం జరిగింది. దేశవ్యాప్తంగా 500 బొగ్గుబ్లాకులను మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అమ్మకానికి పెట్టింది. విశాఖ స్టీల్ ప్లాంట్,ఇన్సూరెన్స్, రైల్వే, విమానయానాలు, ఎయిర్పోర్టులు,డిఫెన్స్ రంగంతో పాటు దేశంలోనే ప్రభుత్వరంగ సంస్థలన్నిటిని తెగనమ్మివేస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రైవేటు ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని తీర్పునిచ్చింది అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనంగా నెలకు 26 వేల రూపాయలు చెల్లించాలని నివేదికలు తెలియజేశాయి అయినప్పటికీ అసంఘటిత సంఘటిత రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచడం గాని సౌకర్యాలను అమలు చేయడం గాని కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం లేదు.అంతేకాకుండా జొమాటో,గిజ్, అమెజాన్,స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించడం లేదు.కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావడంలేదు. చికాగో, నెల్లిమర్ల కార్మిక అమరుల త్యాగాల స్ఫూర్తితో నేడు కార్మిక వర్గం పోరాడటానికి సిద్ధంగా వలసిన అవసరం ఉంది పరిశ్రమల రక్షణ కోసం ఉద్యోగ భద్రత కోసం సమాన పనికి సమాన వేతన సాధన కోసం నెలకి 26 వేల కనీస వేతనం సాధించడం కోసం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయకుండా రక్షించుకోవడం కోసం పీఎఫ్ ఈఎస్ఐ పెన్షన్ చట్టబద్ధమైన హక్కులు సౌకర్యాల కోసం జీవించే హక్కు కోసం కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉన్నది లేనట్లయితే 150 సంవత్సరాల క్రితం కార్మిక వర్గం దుర్భరదారిద్ర పని పరిస్థితులను చీకటి బతుకులను గడిపిందో నేడు అదే పరిస్థితిని అనుభవించాల్సిన దుస్థితి పాలకవర్గాలు తీసుకువస్తాయి. చికాగో కార్మికుల రక్తతర్పణలు భవిష్యత్తు కార్మిక వర్గ ప్రయోజనాల కోసం అర్పించబడిందని విషయాన్ని నేటి కార్మిక సోదరులందరూ గమనంలో ఉంచుకొని మన పరిస్థితిలో మెరుగుదల కోసం భవిష్యత్తు తరాల ప్రయోజనం కోసం 137 మే డే సందర్భంగా సమర శంఖం పూరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్ అమరావతి..

# మూడేళ్లలో పూర్తి చేస్తా..



**అమరావతి,:** అమరావతి రాజధాని పునర్నిర్మాణం చేస్తున్నామంటే ఈరోజు కంటే ప్రత్యేకమైన రోజు మరి ఏది ఉండదని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. గతంలో మోడీని ఎప్పుడు కలిసిన చాలా ఆహ్లాదకరంగా ఉండేవారని.. కానీ మొన్నటి సమావేశంలో అమరావతికి రమ్మని పిలవడానికి వెళ్తే.. తమ భేటీ చాలా గంభీరంగా సాగిందని గుర్తు చేశారు. దీనికి ఏకైక కారణం ఉగ్రవాదుల దాడితో నా దేశ ప్రజల ప్రాణాలు కోల్పోయారని మోడీ ఆవేదనను మోడీలో తాను చూసినట్లు సీఎం తెలిపారు. ఉగ్రవాదులను అంతం చేయడానికి కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయంలో తాము ప్రధానికి అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు మోడీకి అండగా ఉన్నారన్నారు. అమరావతిని మూడేళ్లలో పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అప్పుడు ప్రధాని మోడీని మళ్లీ ఆహ్వానిస్తామని చెప్పారు.. "రూ.57,980 కోట్ల ప్రాజెక్టులకు ఇవాళ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి.. మోడీ గైడెన్స్‌తో అమరావతిని ప్రపంచం మెచ్చే రాజధానిగా తయారు చేస్తాం.. అమరావతి 5 కోట్ల మంది ప్రజల సెంటిమెంట్.. 5 లక్షల మంది అమరావతిలో చదువుకునే అవకాశం ఉంటుంది.. అమరావతిని హెల్త్, ఎడ్యుకేషనల్ హబ్‌గా చేస్తాం.. అమరావతిని పర్యావరణహితంగా తయారు చేస్తాం.. బిట్స్ పిలానీ, టాటా ఇన్నోవేషన్ హబ్ లాంటి సంస్థలు ఇక్కడికి వస్తాయి." అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. "కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.. 2024 ఎన్నికల్లో నేను, పవన్ కళ్యాణ్ కలిసి పని చేసి 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం.. ఇప్పుడు కేంద్రం ఇచ్చిన ఆసరాతో ఏపీ అభివృద్ధిలో ముందుకు వెళ్తుంది.. కేంద్రం సహకారంతో అమరావతిని మళ్లీ పట్టాలెక్కిస్తున్నాం.. 34 వేల ఎకరాల భూమిని రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చారు.. అమరావతి రైతులు వీరోచితంగా పోరాడారు, ఇది వాళ్ల విజయం.. అమరావతి రైతులు చేసిన ఉద్యమం లాంటి ఉద్యమాన్ని ఇంత వరకు నేను ఎప్పుడూ చూడలేదు." అని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.

## సోనియా గాంధీ, రాహుల్‌లకు షాక్..
## నేషనల్ హెరాల్డ్ కేసులో నోటీసులు జారీ!



**న్యూఢిల్లీ,:** సోనియా గాంధీ, రాహుల్?లకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తాజాగా నోటీసులు జారీచేసింది. నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసు సంబంధించి కాంగ్రెస్ మాజీ చైర్ పర్సన్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతోపాటు ఇతర ప్రతిపాదిత నిందితులకు కూడా ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇక ఈ నోటీసులు వారి పేర్లపై దాఖలైన చార్జ్‌షీట్‌పై కోర్టు వాదనలు వినేందుకు ఇచ్చినవిగా పేర్కొంది. ఈ విషయమై కోర్టు తెలిపిన ప్రకారం.. ఈ కేసు సంబంధించి ఇప్పటికే చార్జ్‌షీట్‌లో ఉన్న లోపాలను తొలగించారని పేర్కొంది. అయితే ఇప్పుడు ప్రధానంగా పరిశీలించాల్సిన విషయం ఏంటంటే.. భారతీయ నగరిక సురక్షా సంహిత లోని సెక్షన్ 223 ప్రకారం నోటీసులు జారీ చేయాలా అనే అంశమేనని న్యాయమూర్తి తెలిపారు. ఈ కేసును తదుపరి విచారణ 2025 మే 8 కు వాయిదా వేసారు. అయితే, ఈ దశలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు కోర్టు ముందు వాదనలు వినిపించే హక్కు ఉందని కోర్టు స్పష్టంగా తెలిపింది. ఇది బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 223 ప్రకారం వచ్చే ప్రత్యేక హక్కు అని పేర్కొంది. ఇది మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనలకు వ్యతిరేకంగా కాదని కోర్టు అభిప్రాయపడింది. అలాగే, తదుపరి దశలలో న్యాయమైన విచారణ కోసం ఈ హక్కు కీలకమని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ దశలో ఆరోపణలపై వాదనలు వినడమే న్యాయపరమైన న్యాయ విచారణకు ప్రాణం పోసే అంశమని కోర్టు పేర్కొంది. ఇక ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపున వాదించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ తెలిపిన విషయమేమిటంటే.. ప్రస్తుత దశలో నోటీసుల జారీకి ఈడీ వ్యతిరేకం కాదని, న్యాయపరమైన విచారణ సూత్రాలను మద్దతిస్తున్నామని తెలిపారు. ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్ ప్రకారం.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కలిసి నేషనల్ హెరాల్డ్ ప్రచురణ సంస్థ అయిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు క్రిమినల్ కూనస్పిరసీ పథకాన్ని అమలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రకారం రూ. 2,000 కోట్లకు పైగా విలువ ఉన్న ఆస్తులను కేవలం రూ. 50 లక్షలతో యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలోకి బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంస్థను సోనియా, రాహుల్ నియంత్రిస్తున్నారని ఈడీ పేర్కొంది. ఇక ఈ కేసులో సోనియా, రాహుల్‌తో పాటు కాంగ్రెస్ నేతలు సామ్ పిత్రోడా, సుమన్ దుబే లను కూడా ఆరోపణలతో చేర్చారు.

## "ఇక చాలా మందికి నిద్ర పట్టదు"..
## శశిథరూర్, కాంగ్రెస్ వ్యవహారంపై మోడీ..



ప్రధానమంత్రి నరేంద్రమోడీ కేరళలో శుక్రవారం ఇండియా బ్లాక్‌ని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు.వేదికపై ఇద్దరు ప్రతిపక్ష నాయకులు ఉండగానే, ఇండీ కూటమిపై విమర్శలు ఎక్కుపెట్టారు. తిరువనంతపురంలో విజింజం అంతర్జాతీయ ఓడరేవు ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ ప్రాజెక్టుని అదానీ గ్రూప్ చేపట్టింది. తరుచుగా, ఇండీ కూటమి నేతలు అదానీని టార్గెట్ చేస్తూ విమర్శిస్తుంటారు. అయితే, అలాంటి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి కేరళ సీఎం పినరయి విజయన్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కూడా హాజరయ్యారు. ప్రధాని మాట్లాడుతూ.. " ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. నేటి కార్యక్రమం చాలా మందికి నిద్ర పట్టనివ్వదు. ఈ మెసేజ్ ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లి చేరుకుంటుంది" అని మోడీ హాస్యాస్పదంగా అన్నారు. శశిథరూర్‌కి కాంగ్రెస్‌కి ఇటీవల దూరం పెరుగుతున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ప్రధాని మోడీ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రధానిని తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్‌లో థరూర్ పర్సనల్‌గా రిసీవ్ చేసుకోవడంతో పాటు, విజింజం పోర్టును ప్రారంభించడం కోసం ఎదురుచూస్తున్నట్లు శశిథరూర్ ట్వీట్ చేశారు. ఇటీవల, రష్యా ఉక్రెయిన్ యుద్ధ సమయంలో మోడీ ప్రభుత్వం అవలంభించిన విదేశాంగ విధానాన్ని థరూర్ కొనియాడారు. భారతదేశ వ్యాక్సిన్ టీకా దౌత్యాన్ని కూడా థరూర్ ప్రశంసించారు. ఇదే కాకుండా, కేరళలోని పినరయి విజయన్ ప్రభుత్వాన్ని కూడా థరూర్ ప్రశంసించారు. తనను పట్టించుకోకుంటే, తనకు వేరే ఆప్షన్లు ఉన్నాయంటూ గతంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి ఆయనకు మధ్య విభేదాలు ఏర్పడినట్లు ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోడీ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# తీవ్రత లేని తీర్మానం



పహల్గాం ఉగ్రఘాతుకాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రపంచ దేశాలకు కనువిప్పు కలిగేలా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం పాఠం ఉంటుందని భారత్ ఆశించింది. కానీ తీర్మానం ఎవరికీ ఏమాత్రం నొప్పి కలగని రీతిలో మొక్కుబడి తంతుగా ముగిసింది. " అంతర్జాతీయ శాంతిభద్రతలకు తీవ్రమైన ప్రమాదం కలిగించే బహు రూపాల్లో, వ్యక్తీకరణల్లో ఉగ్రవాదం నెలకొంది. ఉగ్రవాద మూకలను, వారిని పెంచి పోషిస్తున్న బాధ్యులను చట్టం ముందుకు తీసుకురావలసిన అవసరం ఉంది" అని తీర్మానం ప్రకటించింది. ఈ ప్రకటనలతో ఎలాంటి ఫలితం ఉండదన్న సంగతి అందరికీ తెలిసిందే. పహల్గాం దాడికి తామే బాధ్యులమని ది రెసిస్టెన్స్ ఫోర్స్ (టిఆర్ఎఫ్) మొదట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ టిఆర్ఎఫ్ పేరు తీర్మానంలో ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే టిఆర్ఎఫ్ వంటి ఉగ్రవాద పిల్ల సంస్థలకు మూలవేరుగా పేర్కొనే లష్కర్ ఇ తొయిబాను ఉగ్రవాద సంస్థగా భద్రతా మండలి ఎప్పుడో గుర్తించింది. పహల్గాం దాడి వెనుక లష్కర్ ఇ తొయిబా ప్రేరణ ఉందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ లష్కర్ ఇ తొయిబా పేరు కానీ, దీంతో సంబంధం ఉన్న గ్రూపుల విషయం కానీ తీర్మానంలో ఎక్కడా పేర్కొనక పోవడం విశేషం. ముస్లిమేతరులను టార్గెట్ చేసుకున్న ఉగ్రవాదుల గురించి కానీ, మతపరమైన ఉద్రిక్తతలను ప్రేరేపించే లక్షం పెట్టుకున్న విద్రోహ చర్య గురించి కానీ, తీర్మానంలో రేఖామాత్రమైనా ప్రస్తావించలేదు. ఉగ్రవాద నిర్మూలన ప్రయత్నంలో గతంలో మాదిరిగా భారత ప్రభుత్వంతో అన్ని దేశాలూ సహక రించాలన్న సూచన కూడా తీర్మానంలో చోటు చేసుకోలేదు. ఇదివరకటి తీర్మానాలతో పోలిస్తే ఇప్పటి తీర్మానం భాష ముసాయిదా పూర్తిగా నీరు కారిపోయినట్టు స్పష్టమవుతోంది. రాజీ పూర్వకంగా అందరికీ ఆమోదయోగ్యమైన భాషను ఉపయోగించినట్టు తెలుస్తోంది. దీని వెనుక పాకిస్థాన్, చైనా దేశాల ప్రభావం ఉన్నట్టు చెప్పవచ్చు. భద్రతా మండలికి శాశ్వతేతర సభ్య దేశంగా ఈ ఏడాదే పాకిస్థాన్ ఎన్నికైంది. పాకిస్థాన్‌కు సర్వకాల మిత్రదేశం చైనా. పాకిస్థాన్‌ను ఇరకాటంలో పెట్టే సంక్లిష్టమైన తీర్మానాలను తీసుకురాకుండా చూడడంలో చైనా హస్తం ఉంది. గతంలో కూడా అనేకసార్లు పాకిస్థాన్ పక్షాన చైనా నిలిచిన ఉదంతాలు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడిపై తమపై వచ్చిన ఆరోపణలపై ప్రపంచ దేశాల దృష్టిని మళ్లించేందుకు పాకిస్థాన్ ఎంతో ప్రయత్నిస్తోంది. దానికి చైనా, అమెరికా సాయం కోరుతోంది. ఈ సందర్భంలో పహల్గాం దాడిపై నిష్పాక్షిక దర్యాప్తును వేగవంతం చేయాలని పాకిస్థాన్ డిమాండ్ చేస్తోంది. దానికి చైనా వంత పాడుతోంది. అమెరికా, రష్యా, బ్రిటన్ దేశాలైనా సరే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏ తీర్మానం తీసుకువచ్చినా ఆమోదం లోకి తీసుకురావద్దని ప్రస్తుత భద్రతా మండలి అధ్యక్షుడు , ఫ్రాన్స్ దౌత్యవేత్తకు పరోక్షంగా చైనా సంకేతాలందిస్తోంది. ఫలితంగా భద్రతా మండలి తీర్మానం పసలేక మెత్తగా వెలువడింది. తీర్మానంలో టిఆర్ఎఫ్ పేరు లేకుండా చేయడంలో అమెరికాతో కలిసి చైనా లాబీ చేయడంలో కృతకృత్యురాలైంది. ఎలాంటి సాక్షాధారాలు లేవని టీఆర్ఎఫ్‌ను తప్పించింది. దీంతో టీఆర్ఎఫ్ తన ఇదివరకటి ప్రకటనను ఉపసంహరించుకుంది. టీఆర్ఎఫ్ పేరును తొలగించి భద్రతా మండలి తుది తీర్మానం ఖరారు చేసిన తరువాత పాకిస్థాన్ విధానపరమైన వైఖరికి అనుకూలంగా తనకు తాను మలచుకుంది. పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని , భద్రతను చైనా సమర్థిస్తుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఝూ ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం. పాకిస్థాన్‌లో వివిధ ప్రాజెక్టుల్లో కొన్ని వేల మంది చైనా జాతీయులు పనిచేస్తున్నారు. మిత్రదేశమైన పాకిస్థాన్‌ను ఉగ్రవాద విషయంలో తూర్పారపట్టితే పాక్‌తో వైరం కొని తెచ్చుకోవలసి వస్తుందని, పాక్ లోని చైనా జాతీయులకు రక్షణ లేకుండా పోతుందని చైనా ముందుచూపుతో వ్యవహరిస్తోంది. భద్రతా మండలి వ్యవహారం భారత్‌కు అసంతృప్తి కలిగిస్తోంది. ఉగ్రవాదాన్ని ఖండిస్తూ అత్యంత కఠినమైన పదజాలంతో తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలన్న ఆలోచనలో భారత్ ఉంది. పాకిస్థాన్ స్థావరంగా ఉగ్రకార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఇ మొహమ్మద్ చీఫ్ మసూద్ అజహర్ నిర్వాకాన్ని పుల్వామా దాడి తరువాత భారత్ ప్రపంచానికి చాటి చెప్పింది. పహల్గాం దాడికి బాధ్యులైన టిఆర్ఎఫ్ వంటి ఉగ్రసంస్థలను ఐక్యరాజ్యసమితి వేదికగా ప్రపంచ దేశాలకు నిరూపించాలన్న పట్టుదలతో భారత్ ఉంది. 2008 లోముంబై, 2019 లో పఠాన్‌కోట్, 2019లో పుల్వామా ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో అలాంటి ఉగ్రదాడులకు వీలు కల్పించకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని పాకిస్థాన్ గతంలో అనేక సార్లు భారత్‌కు ద్వైపాక్షిక చర్చలో హామీలు ఇచ్చింది. కానీ ఏవీ నెరవేర్చలేకపోయింది. భారత్‌తో దౌత్యపరమైన సంబంధాలు కూడా సరిగ్గా సాగించడం లేదు. పాకిస్థాన్ ఆర్థిక మూలాలపై వేటు వేయాలన్నది భారత్ ప్రధాన లక్షం. ఉగ్రసంస్థలకు పాకిస్థాన్ నిధులు అందిస్తోందన్న కారణం చూపించి ఫైనాన్షియల్ టాస్క్ ఫోర్స్ ముందు పాక్‌ను నిలబెట్టాలని భారత్ సిద్ధమవుతోంది. 2012 నుంచి 2015,2018 నుంచి 2022 సమయాల్లో పాకిస్థాన్‌ను గ్రే లిస్టులో ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్సు ఉంచిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వేదిక సాక్షిగా ఉగ్రవాద నిర్మూలనకు బహుముఖ ప్రయత్నాలు చేయాలని భారత్ యోచిస్తోంది. ముంబై ఉగ్రదాడుల్లో కీలక పాత్ర వహించిన ఉగ్రవాది తహవూర్ రాణాను అమెరికా నుంచి బహిష్కరింప చేసి ఏ విధంగా భారత్ తన చట్టం ముందుకు తీసుకు రాగలిగిందో అదే విధంగా పహల్గాం ఉగ్రదాడి ముష్కరులను న్యాయస్థానం ముందు నిలబెట్టగలిగితేనే పహల్గాం దాడిలో అమరులైన వారికి ఆత్మశాంతి లభిస్తుంది.

# ఆర్థికాభివృద్ధిలో అసమానతలెన్నో



ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా మారుతుంది అని ప్రగల్భాలు పలుకుతున్న ప్రస్తుత పాలకులు ఇకనైనా ప్రజల వాస్తవ పరిస్థితిని గమనించి, ఈ ఆర్థికాభివృద్ధి వాపా లేక బలుపా అని బేరీజు వేసుకుని ముందుకుసాగడం ఉత్తమం. ఎందుకంటే ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా అనేక అంతర్జాతీయ సంస్థలు వివిధ అంశాలపై ప్రకటించిన అనేక ర్యాంకులు పరిశీలిస్తే భారతదేశ వాస్తవ అభివృద్ధి కళ్ళకు కట్టినట్లు కనపడుతున్నది. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల' సాధనలో మన దేశం 109వ స్థానంలో నిలిచింది. మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో 134వ స్థానం, సంతోష సూచికలో 126వ స్థానంలో, ఆకలి సూచిలో 105వ స్థానంలో, అవినీతిలో 96వ స్థానంలో, పోషకాహార లోపంలో 111వ స్థానంలో, మహిళా రక్షణ లో 128వ స్థానంలో, మల్టీ డైమెన్షనల్ పావర్టీలో 126వ స్థానంలో, లింగ సమానత్వంలో 129వ స్థానంలో, తలసరి ఆదాయంలో 124వ స్థానంలో, అక్షరాస్యత రేటు 80% శాతం లోపు, నిరుద్యోగం దాదాపు 5% శాతంతో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో భారత్ ఐదవ ఆర్థిక వ్యవస్థగా మారటం వల్ల భారతదేశానికి ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకుకలిగిన ప్రయోజనం ఏమిటి? ఇది మన అందరినీ వెంటాడుతున్న ప్రశ్న. ఈ ప్రశ్నలకు నేటి పాలకులు సమాధానం చెప్పాలి. నేటికి భారత దేశంలో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ప్రపంచంలోనే ప్రాముఖ్యత కలిగిన వంద విశ్వవిద్యాలయాల్లో మన దేశం నుంచి ఒకటి లేకపోవడం గమనార్హం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల పూర్తి అవుతున్నా, నేటికీ వివిధ ఉచిత పథకాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు సుమారు 70 కోట్ల మందికి పంచుతూ, కనీసం ఒక్క పూట భోజనం ఏర్పాటు చేయడం జరుగుతున్నదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు పరిశీలిస్తే, తేటతెల్లం అవుతుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ, పేద మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుంది. ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మండుతున్నాయి. ఎక్కడ చూసినా నిరుద్యోగం తాండవిస్తున్నది. ఉద్యోగ ఉపాధి అవకాశాలులేక వలసల భారతంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారినా ఎవరికి లాభం? కేవలం ఈ అభివృద్ధి అంతా కొందరి బడా పారిశ్రామిక వేత్తలు, సంస్థలకు చెందినదిగా గుర్తించాలి. కార్పొరేట్ వ్యక్తుల అభివృద్ధే దేశాభివృద్ధిగా చెబుతూ పాలకులు ప్రజలను నమ్మించడం ఇకనైనా మానాలి. దేశానికి అన్నం అందించే అన్నదాతలు ఆర్తనాదాలు పాలకులకు వినబడడం లేదు. రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు కనపడటం లేదు. కేవలం నాలుగు రహదారులు, ఆరు విమానాశ్రయాలు, పది పదంతస్థుల ఆకాశహర్మ్యాలు నిర్మించి, యాభై, డెభై అడుగుల విగ్రహాలు, సందర్శించే దేవాలయాలు, ఆకర్షించే కుంభమేళా వంటివి చేయడం ద్వారా దేశంలో పేదరికం తగ్గుతుందా! ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ద్వారా వాస్తవాలు ఎల్లకాలం దాచలేరు. గతంలో 8%, 9% ఉన్న జిడిపి, నేడు 5 నుంచి 6 మధ్య కదలాడుతున్నదని గ్రహించాలి. ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. ట్రంప్ తీసుకుంటున్న టారిఫ్ నిర్ణయాలతో అనేక ఒడిదుడుకులు ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇకనైనా పాలకులు పారిశ్రామిక రంగానికి, వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వాలి. గతంలో కంటే కొన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినా, కీలక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఉంది. 'చైనా' వలే స్వయం సమృద్ధి సాధించేందుకు కృషి చేయాలి. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. నినాదాలు కాదు సరైన నిర్ణయాలు తీసుకోవడం జరగాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు ఊబిలో కూరుకు పోకుండా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి. కుల, మత, వర్గ, భాష, లింగ వివక్షలు తొలగించడానికి కృషి చేయాలి. అంతేకాని కొందరు బడా పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ వ్యక్తుల బిలియనీర్ల సంపదే దేశ అభివృద్ధి అని నమ్మి, దేశం మూడో ఆర్థిక వ్యవస్థగా మారింది అని చెప్పి మురిసిపోవడం చాలా ప్రమాదకరం అని గ్రహించాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు 'దేశ ప్రజలు అందరి అభివృద్ధే దేశాభివృద్ధి' అని నమ్మి ముందుకు సాగడం ఉత్తమం.

# కేంద్రానికి 'కులగణన' సవాల్



కులాల గణన పేరు చెబితే భయపడే కమలనాథులు ఇప్పుడు అకస్మాత్తుగా కులగణన చేపట్టడానికి తలవంచడం విస్మయం కలిగిస్తోంది. జనాభాలో కులాలవారీ శాతాలు బయటపడితే అగ్రవర్ణాలకు దూరం కావలసి వస్తుందని బిజెపితటపటాయించేది. బిజెపి మొదటినుంచీ హిందుత్వ భావజాలంతో అగ్రవర్ణాలను అక్కున చేర్చుకుని వారి ఓటు బ్యాంకు కొల్లగొట్టి అధికార ప్రాపకం పొందేది. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగా గతంలో విపి సింగ్ ప్రభుత్వం ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించినప్పుడు దానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో హింసాత్మక ఆందోళనలు చెలరేగడం మరచిపోలేని వాస్తవం. 2021 జనాభా లెక్కల సేకరణలో భాగంగా కులాలవారీ లెక్కలు సేకరించడం సాధ్యంకాదని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టం చేయడం ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకోవలసి ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చే జనాభా లెక్కల సేకరణలో భాగంగా కులగణనను కూడా నిర్వహించనున్నట్టు ప్రకటించడం అనూహ్యమైన నిర్ణయం. పహల్గాం ఉగ్రదాడిపైనే దేశమంతా ఆందోళన చెందుతున్న తరుణంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఏ కారణాలు ప్రభావితం చేశాయన్నది ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది.కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పటికిప్పుడే పుట్టుకొచ్చింది కాదు. గత సెప్టెంబరులోనే కేంద్రం సంకేతాలిచ్చింది. 2024 లోక్‌సభ ఎన్నికల ముందునుంచే విపక్షాలు కులగణన తప్పనిసరి అంటూ డిమాండ్ చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణతోపాటు కులగణన అంశాన్ని కాంగ్రెస్ సీరియస్‌గా ప్రచారం చేసింది. దీని ప్రభావం లోక్‌సభ ఎన్నికల్లో కొంత కనిపించింది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి సొంతంగా ఆధిక్యతను సాధించకుండా చేయడంలో కాంగ్రెస్ ప్రచారం బాగా పనిచేసిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మోడీ ఆకాంక్షించినట్టు 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బిజెపి రద్దు చేస్తుందన్న కాంగ్రెస్ ప్రచారం కూడా బాగా పనిచేసింది. కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అజెండాలో కులగణన అంశాన్ని రాహుల్ గాంధీ చేర్చారు. ఆమేరకు ఆ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు విజయావకాశాలు మెరుగయ్యాయి. ఈ అవకాశవాద రాజకీయ దృష్టితో రానున్న బీహార్, గుజరాత్, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే విపక్షాల ప్రధాన డిమాండ్‌కు అవకాశం ఇవ్వకుండా 'కులగణన' ప్రధాన ప్రచార ఆయుధంగా ఉపయోగపడుతుందని కమలనాథుల ఎత్తుగడ. బిజెపి పాలకులు కులగణనను వ్యతిరేకిస్తున్న సమయంలోనే రూ. 500 కోట్ల ఖర్చుతో నితీశ్ కుమార్ ప్రభుత్వం బీహార్ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కులగణన జరిపించి అధికారికంగా దాని ఫలితాలను ప్రకటించింది. దేశం మొత్తం మీద బీహార్ తీసుకున్న ఈ చొరవ దేశ రాజకీయాల్లో కొత్త మలుపుకి నాంది పలికిందని చెప్పవచ్చు. 13 కోట్ల మంది జనాభా కలిగిన బీహార్ రాష్ట్రంలో 63% మంది అత్యంత వెనుకబడిన కులాలు (ఇబిసి), ఒబిసి కేటగిరీల కింద ఉన్నారని తేలింది. ఈ డేటా విడుదలై రెండేళ్లు కావస్తున్నా నితీశ్ కుమార్ ప్రభుత్వం ఏ విధంగా తన లక్షాల సాధనకు ఈ సర్వేను ఉపయోగించింది అన్నది ప్రశ్న. ఇప్పుడు కులాల పరిమాణాలు హాట్ టాపిక్. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరాబాదరాగా కాకుండా ఒక పద్ధతి ప్రకారం కులగణన నిర్వహించింది. బిసిలకు విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అన్ని పార్టీల తోడ్పాటుతో బిల్లును శాసనసభలో ఆమోదింప చేసింది. ఈ ఆమోదాన్ని కేంద్రానికి పంపి మోడీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసింది. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో పదేళ్ల క్రితం వందకోట్లకు పైగా ఖర్చుపెట్టి కులగణన నిర్వహించినా ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోతున్నారు. కర్ణాటకలో రెండు ప్రధాన కులాలైన వక్కలిగలు, లింగాయతులు తమ జనాభాను తక్కువ చేసి చూపించారని బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. ఈ రెండు కులాలకు చెందిన కాంగ్రెస్, బిజెపి ఎంఎల్ఎలు కూడా వీరంగం సృష్టిస్తున్నారు. కులాలవారీ జనాభా లెక్కలు బ్రిటిష్ వారి పాలనలోనే దేశంలో 1933 లో చివరిసారి జరిగింది. అప్పటి నుంచి ఆగిపోయిన ఈ ప్రక్రియను తిరిగి చేపట్టాలన్న డిమాండ్ చిరకాలంగా వెనుకబడిన తరగతులనుంచి వస్తోంది. 1933 నాటి కులాలవారీ సేకరణ ఆధారంగానే ఒబిసిలు దేశ జనాభాలో 36% మాత్రమే ఉంటారని ఒక వర్గం, 60 నుంచి 70 శాతం ఉంటారని మరో వర్గం వాదనలు లేవదీయడమే తప్ప కచ్చితమైన వివరాలు ఎవరూ చెప్పలేకపోతున్నారు. భారత రాజకీయాల్లో కులం అన్నది గుండెకాయ వంటిది. జనాభా లెక్కలతోపాటు కులగణన నిర్వహిస్తే కులాలవారీ కచ్చితమైన సమాచారం వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కుల పరిమాణం, ఆర్థిక, సామాజిక పరిస్థితులు, అక్షరాస్యత స్థాయిలు, వృత్తులు, ఉద్యోగ స్వభావాలు తదితర ఇలాంటి క్షేత్రస్థాయి వాస్తవాలన్నీ బయటపడతాయి. ఏదైనా కులం ఎలాంటి వసతులు కానీ, ప్రభుత్వ సాయం కానీ అందకుండా బాగా వెనుకబడినా లేదా ఎవరైతే సమాజం విచక్షణకు గురయ్యారో, వారు ఎలా బతుకుతున్నారో ఈ వాస్తవాలన్నీ బయటపడతాయి.దీన్ని బట్టి ప్రభుత్వాలు తమ పాలన విధానాలను మెరుగుపర్చుకోడానికి ఆస్కారం కలుగుతుంది. కులాల సంఖ్య తేలితే ఎక్కువ కోటాలు డిమాండ్ చేయడానికి ఆందోళనలు రేగుతాయన్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. ఏదేమైనా కేంద్రం ఇప్పుడు చేపట్టాలనుకుంటున్న కులగణన శాస్త్రీయంగా, పారదర్శకంగా ఉంటేనే సత్ఫలితాలు చేకూరుతాయి. అయితే కేంద్రం ఎప్పుడు ఈ కులగణన చేపడుతుందో తెలియడం లేదు.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com